నేటి కందం- నేటికి అందం

మనమునకు నాటు విధముగ
మనవాడగు మోడి పొదుపు మంత్రము జదువన్
జనులంద రనుసరించగ
ఘనముగ దేశమ్ము పట్టె క్రమ పథమ్మున్ !!

(ప్రధాని నరేంద్ర మోడీ చెప్పిన పొదుపు ను దేశజులంతా అనుసరిస్తున్నారు. మంత్రులు అధికారులు న్యాయమూర్తులు తమతమ రవాణా ఖర్చులను తగ్గించుకుంటున్నారు. దేశానికి ఇది శుభ పరిణామం.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

తంద్రులింకా మంత్రులైతే
తనయులే యువరాజులు
తప్పులన్నీ ఒప్పులే
తీర్చుకోను తమ మోజులు.
పోక్సోలు శిక్షలన్నీ
ప్రజలకే వర్తింపా
పోలీసుల బాధ్యతంతా
పవర్ చుట్టే నర్తింపా

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 15-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:217 పేజీలు:6 వెల: రూ.1/-

## మోదీ.. బాటలో ఏపీ, తెలంగాణ సీఎం పొదుపు మంత్రం

**ఇప్పటికే కాన్వాయ్‌లలో కోత విధించిన చంద్రబాబు, రేవంత్**
**మంత్రులకు సైతం వాహనాలు కట్**
**ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వాహన షేరింగ్ ప్రతిపాదన**
**సాధ్యమైనంత వరకు ప్రజారవాణా వినియోగించాలని ఆదేశం**
**పగటి పూట ఏసీలు కట్.. సోలార్ పవర్‌కు ప్రాధాన్యం**
**వాహన శ్రేణిలో విద్యుత్ వాహనాలపై మొగ్గు**

హైదరాబాద్, మే 14: పశ్చిమాసియాలో చోటు చేసుకున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపు చర్యలను చేపట్టడంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడుగులు వేస్తున్నారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండటంతో పాటు ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే లక్ష్యంగా ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమ భద్రతా వాహనాల శ్రేణిని (కాన్వాయ్) గణనీయంగా తగ్గించుకోవాలని నిర్ణయించారు. సాధారణంగా ముఖ్యమంత్రులు, మంత్రులు పర్యటించే సమయంలో పెద్ద సంఖ్యలో వాహనాలు వెంట రావడం సహజం. అయితే ఇకపై జిల్లాల్లో పర్యటించేటప్పుడు తమ కాన్వాయ్‌లలో ఉండే వాహనాల సంఖ్యను 50 శాతానికి తగ్గించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కేవలం వీరు మాత్రమే కాకుండా, మంత్రులు, ఇతర వీఐపీలు కూడా సాధ్యమైనంత తక్కువ వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక ప్రభుత్వకార్యాలయాలలో పగటి సమయంలో ఏసీలు వేయరాదని ఆదేశాలిచ్చారు. సోలార్ పవర్ తో నడిచే కార్యాలయాలకు మినహాయింపు ఇచ్చారు.. ఇక ఉన్నత స్థాయి ఉద్యోగులు షేరింగ్ కార్లను మాత్రేమే వినియోగించాలని కోరారు.. సాధ్యమై నంతవరకు కార్యాలయాలకు వచ్చేందుకు ప్రజారవాణ వ్యవస్థను వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పొదుపు చర్యలు పాటిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని, అదే బాటలో రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని కొనసాగించాలని పవన్ కల్యాణ్ తన కార్యాలయం ద్వారా వెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల సోషల్ మీడియా వేదికగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం జరగనున్న క్యాబినెట్ భేటీలో ఈ పొదుపు చర్యలకు సంబంధించి మరిన్ని కీలక విధాన నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉంది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను కుదించుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కాన్వాయ్‌లో సుమారు 9 వాహనాలు ఉండగా, వాటిని 4 నుంచి 5 వాహనాలకు పరిమితం చేసేలా కసరత్తు చేయాలని భద్రతా విభాగం పోలీసు అధికారులకు సూచించినట్లు సమాచారం. ఆయన తన నివాసం నుంచి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీకి వెళ్లే క్రమంలో కేవలం మూడు వాహనాలతోనే ప్రయాణించడం ద్వారా తన సంకల్పాన్ని చాటుకున్నారు. ఈ అంశంపై రాబోయే రెండు రోజుల్లో స్పష్టత రానుంది, తద్వారా మంత్రుల కాన్వాయ్‌లలో కూడా వాహనాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

## కేరళం సీఎం వీడీ సతీశన్‌కు రేవంత్‌రెడ్డి అభినందనలు



హైదరాబాద్, మే 14: కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు.

విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## త్వరలోనే 'నీట్' షెడ్యూల్ ప్రకటన

హైదరాబాద్, మే 14:నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ – అండర్ గ్రాడ్యుయేట్(నీట్ యుూజీ) 2026 రీ షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు. అకడమిక్ క్యాలెండర్ సహా ఇతర ప్రధాన పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, కొత్త తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) డీజీ తెలిపారు. అయితే.. ఈ పరీక్షను జూన్‌లో నిర్వహించే అవకాశమున్నట్టు తెలుస్తోంది. 2024లోనూ ఇదే తరహాలో నీట్ యూజీ పరీక్ష రద్దైన సందర్భంలో జూన్ 23న మరోసారి పరీక్ష జరిగింది.

ఎన్టీఏ అధికారుల ప్రకారం.. నీట్ పరీక్ష కోసం అభ్యర్థులు మళ్లీ కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. మే 2026లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలు, ఫీజుతో పాటు ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాలు వంటివి అలాగే కొనసాగుతాయి. అయితే.. అడ్మిట్ కార్డులను మాత్రం కొత్తగా జారీచేస్తారు. హాల్ టికెట్లు విడుదలైన తర్వాత neet.nta.nic.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంటాయి.

దర్యాప్తు ముమ్మరం..

నీట్ యూజీ పేపర్ లీక్ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేసిన సీబీఐ అధికారులు.. ఇప్పటివరకు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నాసిక్(మహారాష్ట్ర)కు చెందిన శుభమ్ ఖైర్నార్, జైపూర్(రాజస్థాన్)కు చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్, వికాస్ బివాల్, గురుగ్రామ్(హరియాణా)కు చెందిన యశ్ యాదవ్‌లను నేడు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. లీకైన ప్రశ్నపత్రం కోసం విద్యార్థుల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిందితులు వసూలు చేసినట్లు సమాచారం.

## యూపీలో బీభత్సం సృష్టించిన అకాల వర్షం.. 100కు చేరిన మృతుల సంఖ్య..!

న్యూ ఢిల్లీ, మే 14:ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మండు వేసవిలో అకాల వర్షాల తో అతలాకుతలమైంది. తీవ్రమైన గాలి దుమారం, భారీ వర్షం సృష్టించిన పెనుబీభత్సం కారణంగా రాష్ట్రంలో ఒక్కరోజే 100 మంది ప్రాణాలు కోల్పోయారు. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసింది. గాలి దుమారం, వడగళ్ల వాన, పిడుగుల కారణంగా మే 13న పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ వర్షాల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో 100 మంది మృతిచెందారు. మరో 60 మందికిపైగా గాయపడ్డారు. 114 జంతువులు మరణించాయి. 87 ఇళ్లు ధ్వంసమయ్యాయి.

యూపీ రిలీఫ్ కమిషనర్ కార్యాలయం ఈ విషయాలను వెల్లడించింది. అకాల వర్షాలవల్ల జరిగిన ఆస్తి, ప్రాణనష్టంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరాతీశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సీఎం సమీక్షిస్తున్నారని, వర్ష ప్రభావిత జిల్లాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాగ్‌రాజ్, భదోహి, సోన్‌భద్ర, ఫతేపుర్ తదితర జిల్లాల్లో గాలివాన బీభత్సం జరిగింది. ప్రయాగ్‌రాజ్‌లో 21 మంది, భదోహిలో 16 మంది, ఫతేపుర్‌లో 11 మంది, సంత్ రవిదాస్ నగర్‌లో 14 మంది, మీర్జాపుర్‌లో 10 మంది మృతి చెందినట్లు ఆయా జిల్లాల యంత్రాంగాలు వెల్లడించాయి.

## నీట్ పరీక్ష రద్దుపై పారదర్శక విచారణ జరగాల్సిందే: సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్, మే 14:నీట్ యూజీ 2026 పరీక్ష రద్దుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దుతో లక్షలాది మంది విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులు షాక్‌కు గురయ్యారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్రానికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును పేపర్ లీక్ ఘటనలు దెబ్బతీస్తున్న నేపథ్యంలో పరీక్షల విశ్వసనీయతను కేంద్రం కాపాడాలని రేవంత్ రెడ్డి కోరారు. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు మళ్లీ ఇబ్బందులు పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే, నీట్ అక్రమాలపై పారదర్శకంగా దర్యాప్తు జరపాలని కోరారు.

పోటీ పరీక్షలు అవకాశాల వేదికగా ఉండాలే తప్ప విద్యార్థుల జీవితాలను నాశనం చేసేలా మారకూడదని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు.

పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ వంటి వాటిల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య పోలిక ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

## సాయి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

హైదరాబాద్, మే 14: బాలికపై లైంగిక దాడి, ఇతర నేరారోపణల నేపథ్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. బండి సాయి భగీరథ్ కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు మంగళవారం కరీంనగర్‌కు వెళ్లి, విచారణ నిమిత్తం భగీరథ్‌ను వెంట తీసుకొని బుధవారం మధ్యాహ్నం 2గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని అతడి మేనమామ వంశీకృష్ణకు నోటీసులు కూడా అందజేశారు.

అయితే బుధవారం మధ్యాహ్నం విచారణకు పోలీసులు సిద్ధంగా ఉన్నా నిందితుడు మాత్రం హాజరుకాకుండా డుమ్మాకొట్టాడు. పైగా వ్యక్తిగత కారణాలతో తాను ఈ రోజు విచారణకు హాజరుకాలేకపోతున్నానని, పూర్తి ఆధారాలతో ఈ నెల 15న హాజరై పోలీసులకు సహకరిస్తానని, రెండు రోజుల గడువు ఇవ్వాలంటూ పోలీసులకు పంపిన ఈ-మెయిల్‌లో పేర్కొన్నాడు.

ఈ క్రమంలో నిందితుడు బండి సాయి భగీరథ్ తరపు న్యాయవాది హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు విచారణ వారం రోజులు వాయిదా వేసింది. బండి సాయి భగీరథ్ ఇంటరిమ్ ప్రొటెక్షన్ (మధ్యంతర రక్షణ)పై విచారణను వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు తెలిపింది

## వారంలో 2 రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్.. ప్రకటించిన ఢిల్లీ సర్కారు



న్యూ ఢిల్లీ, మే 14:ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ఇవాళ కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేసుకోవచ్చు అని వెల్లడించారు. వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని సూచించారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధనం వినియోగం తగ్గించుకోవాలని ప్రధాని మోదీ కొన్ని పొదుపు చర్యలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ సర్కారు చర్యలు చేపట్టింది. ఆఫీసర్ల వాహనాలకు చెందిన పెట్రోల్, డీజిల్ కోటాను 20 శాతం కోత విధించారు. అన్ని మంత్రిత్వ శాఖలకు చెందిన ఆఫీసర్లు సోమవారం రోజు మెట్రో వాడాలని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సూచన చేశారు.

## ప్రధాని సందేశం.. కాన్వాయ్ తగ్గించుకోవాలని తెలంగాణ గవర్నర్ నిర్ణయం

హైదరాబాద్, మే 14: పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆచరిస్తున్నారు.

తన కాన్వాయ్‌ను తగ్గించుకోవాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రధాని సందేశానికి తాము మద్దతు ఇస్తున్నామని గవర్నర్ వెల్లడించారు. వాహనాలను తగ్గించే ప్రధాని కార్యక్రమాన్ని తాము అమలు చేస్తున్నట్లు చెప్పారు. లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలను తగ్గించామని అన్నారు. వాహనాలను తగ్గించడం వల్ల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు.

## బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీ.. మంటల్లో నలుగురు సజీవ దహనం, 10 మందికి గాయాలు



అహ్మదాబాద్, మే 14: ఆయిల్ ట్యాంకర్‌ను ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మరో పది మందికి కాలిన గాయాల య్యాయి. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గుజరాత్‌లోని సురేంద్రనగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. లగ్జరీ ప్రైవేట్ బస్సు 40 మంది ప్రయాణికులతో అహ్మదాబాద్ నుంచి రాజ్‌కోట్ వైపు వెళ్తున్నది.

కాగా, గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో చోటిలా-రాజ్‌కోట్ జాతీయ రహదారిలోని సంగని గ్రామం సమీపంలో టైర్ పేలడంతో ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పింది. వేగంగా వెళుతున్న బస్సు ఆ ట్యాంకర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగాయి. బస్సులోని ప్రయాణికులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు.

మరోవైపు నలుగురు ప్రయాణికులు మంటల్లో కాలి సజీవ దహనమయ్యారు. మరో పది మందికి కాలిన గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేయడంతోపాటు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆ ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి ఉత్తమ్



ఖమ్మం జిల్లా, మే 14 : రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. ఈరోజు (గురువారం) కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు.

ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

## కరీంనగర్ నగల దుకాణం దోపిడీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్




హైదరాబాద్, మే 14: కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెల్లరీ నగల దుకాణం దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం వివరాలను మీడియాకు వెల్లడించారు. మొత్తం 161 తులాల బంగారం, 112 క్యారెట్ల వజ్రాభరణాలు చోరీకి గురయిందన్నారు. బంగారం దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన నిందితుడు అని పోలీసులు తెలిపారు.

దోపిడీ తర్వాత రైలు, బస్సు ద్వారా తప్పించుకునేందకు ప్రయత్నించారు. దోపిడీకి రెండు నెలల క్రితమే రెక్కీ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ గ్యాంగ్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ ఝార్ఖండ్ రాష్ట్రాల్లో సుబోధ్ సింగ్ ముఠా చోరీలకు పాల్పడిందన్నారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులను సీపీ అభినందించారు.

జీవజలం చలం
సాహిత్య స్మారకోపన్యాస సభ
19.5.2026 బుధవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాలులో
చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది.
చలం పౌరాణిక సాహిత్యం – వస్తు రూపాలపై
ఎన్.వేణుగోపాల్, కుప్పిలి పద్మ ప్రసంగిస్తారు.
డా.ఏనుగు నరసింహారెడ్డి ఆప్తవాక్యం పలుకుతారు.
చలం పౌరాణిక నాటిక, నాటకాలలోని కొన్ని ముఖ్య భాగాలను –
భండారు విజయ, జ్వలిత, అరుణ ధూళిపాల, ఐనంపూడి శ్రీలక్ష్మి, గడ్డం సులోచన
వినిపిస్తారు.
ఈ సభకు మీరు తప్పక రావాలని మనవి.
– డా. నాళేశ్వరం శంకరం
కన్వీనర్, చలం భావన.



# కుటుంబ ఆరోగ్యమే దేశ సౌభాగ్యం

## (15 మే "అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం" సందర్భంగా)

శాస్త్రసాంకేతిక విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చి వేసింది. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం తిష్ట వేసింది. మరమనుషులు పుట్టుకొచ్చారు. విశాల భావనలు కురుచనైపోయాయి. ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోయి, చిట్టి న్యూక్లియర్ కుటుంబాలు మొలుచుకొస్తున్నాయి. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతలు, పెద్ద నాన్న, పెద్దమ్మ, పిన్ని, బాహోయ్‌ల బంధాలు బలహీనపడుతున్నాయి. 'వన్ ఆర్ నన్' సూత్రాన్ని కుటుంబ నియంత్రణ యంత్రాంగం నేర్పింది. కుటుంబం చిన్నదై, మనసులు కురుచనైపోయాయి. నేటితరం నెట్టిట్లో ఒంటరి సంసారాలు చేస్తున్నది. ఒక్కగానొక్క సంతానమని అతి ముద్దు చేసి గారాబం చేస్తూ, ఒంటరి పక్షుల వలె పంజరంలో పెట్టి పెంచుతున్నాం. ప్రేమానురాగాలు, ఆత్మీయ అనుబంధాలు, త్యాగాలు, కలిమిలేముల భావనలు, పరస్పర సహకార భావనలు, దయ కరుణలు బిత్తరపోయి చూస్తున్నాయి. కుటుంబ విలువలు తగ్గి అరాచక పోకడలు పెరుగుతున్నాయి. జీవనశైలిలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. అమ్మానాన్నలు, పిల్లల మధ్య కూడా వాణిజ్య బంధాలు పుట్టుకొస్తున్నాయి. జీవన గమనం వేగం పుంజుకుంది. తెలియని దానిని పొందడానికి ప్రయాసలు పెరుగుతున్నాయి. విలువలకు తూట్లు పొడుస్తూ కొత్త పోకడలు మొలుస్తున్నాయి. కుటుంబ భావనలు తరిగిపోయి అశాంతి జనిస్తున్నది.

### కుటుంబమే ప్రథమ పాఠశాల:

కుటుంబమే ప్రథమ పాఠశాల, అమ్మానాన్నలే తొలి గురువులుగా లేత వయస్సు నుంచే వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్పాలి. జాతి నిర్మాణంలో కుటుంబ విలువలే పునాదులు. సామాజిక, ఆర్థిక ప్రగతిలో కుటుంబ సభ్యుల భూమిక ప్రధానమైంది. కష్టనష్టాలను అధిగమించే 'షాక్ అబ్జార్బర్'లుగా కుటుంబాలు నిలవాలి. సంపదలతో మాత్రమే సంతోషాలు రావని, త్యాగాలతో కూడిన ప్రేమానురాగాలే అసలైన ఆనందాల నిధులని తెలుసుకోవాలి. మానవాళి మనుగడకు కుటుంబమే ప్రధాన యూనిట్. పౌర సమాజానికి కేంద్ర బిందువు కుటుంబం మాత్రమే. కుటుంబ భావనలకు భారత్ ప్రధాన కేంద్రం అయ్యింది. భార్యాభర్తలు, తమ సంతానం, నాన్నమ్మ, తాతలతో కూడిన కుటుంబం ఓ అద్భుత విశ్వవిద్యాలయం. దైనందిన జీవితంలో కుటుంబం మాత్రమే సుఖదుఃఖాలను తట్టుకోవడం నేర్పుతుంది. కుటుంబ విలువలే జాతికి ఊపిరిగా నిలుస్తాయి. జాతి సంస్కృతి వారసత్వాలకు పునాదులు కుటుంబాలు అని తెలుసుకొని కుటుంబ వ్యవస్థలను గౌరవిద్దాం. గృహం అంటే గోడలు – గదులు కావని, ప్రేమలతో కట్టుకున్న గోడలతో కూడి అందమైన, ఆనందాల హరివిల్లు అని తెలుసుకోవాలి.

### అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం:

పౌర సమాజ క్రమశిక్షణకు పునాదులుగా నిలుస్తున్న కుటుంబాల ప్రాధాన్యాలను వివరించడానికి 1993లో ఐరాస నిర్ణయాన్ని ఆధారంగా సాలీనా ప్రతి ఏట 15 మే రోజున "అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ ఫ్యామిలీ డే" పాటించుట 1994 నుంచి ఆనవాయితీగా మారింది. కుటుంబ బంధాలు పటిష్టమైనపుడు విశ్వశాంతి నెలకొంటూ, సమాజాభివృద్ధి వేగం పుంజుకుంటుంది. పౌర సమాజానికి గుండెకాయ కుటుంబం మాత్రమే. కుటుంబంలోనే మానవీయ విలువలు ప్రారంభం అవుతాయి. సమస్యలకు పరిష్కార వేదికలుగా కుటుంబాలు నిలుస్తున్నాయి. సఖ్యత కొరవడిన కుటుంబాల ప్రభావం పౌర సమాజ సంక్షేమంపై నేరుగా పడుతుంది. పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగాలు కుటుంబ శాంతిని హరించి వేస్తాయి.

### కుటుంబం – సుస్థిరాభివృద్ధికి పునాది:

కుటుంబ సమస్యలకు సామాజిక, ఆర్థిక, సాంకేతికత, పట్టణీకరణ, వలసలు, వాతావరణ మార్పుల ప్రభావాలు పడుతున్నాయి. అంతర్జాత కుటుంబ దినోత్సవం–2026 ఇతివృత్తంగా "కుటుంబాలు, అసమానతలు, బాలల శ్రేయస్సు" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ప్రేమ, పరస్పర గౌరవం, వివేకం, పరస్పర సహకారం లాంటివి కుటుంబాలను ఏకం చేస్తున్నాయి. దాదాపు 80 శాతం కుటుంబాలు వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల్లో ఉంటున్నాయి. కుటుంబాలతో వ్యవసాయానికి ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. సుస్థిర సాగు పద్ధతులు పాటించిన కుటుంబాలు పర్యావరణ పరిరక్షకులుగా నిలుస్తారు. కుటుంబ ఆహార భద్రత, గ్రామీణ ఉపాధులు, కార్బన్ ఉద్గారాలు, ప్రతికూల వాతావరణ మార్పులు, పేదరికం లాంటి అంశాలు కుటుంబ శ్రేయస్సుకు పునాదులుగా నిలుస్తాయి. అల్ప ఆదాయ దేశాల ప్రజల జీవనోపాధులు సహజ ప్రకృతి వనరులపై మాత్రమే ఆధారపడడంతో రేపటి తరం శ్రేయస్సు గాల్లో దీపంగా మారుతోంది. నిన్నటి తరం చేయలేని పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో కనీసం నేటితరం కుటుంబాలు నడుం బిగించాలి.

### కుటుంబ సమస్యలే దేశ సమస్యలు:

కుటుంబ సమస్యలను పరిష్కరిస్తే ప్రపంచ సమస్యలను పరిష్కరించినట్లే అని తెలుసుకోవాలి. కుటుంబాలను ఆనంద కోవెలలుగా మార్చాలి. నిస్వార్థ ప్రేమలకు చిరునామాలు కుటుంబాలు. మనల్ని వరించిన అపూర్వ వరం కుటుంబ ప్రేమ మాత్రమే. ఆరోగ్యం, సంపద, పనిలో సమతుల నిబద్ధత, మహిళా హక్కులపై దృష్టి సారించాలి. కుటుంబాన్ని పౌర సమాజ భవనానికి పటిష్ట సౌధం కావాలి. మూడు, నాలుగు తరాల ప్రేమానురాగాల సమ్మేళనమే ఓ ఆదర్శ కుటుంబం. మనకు పుట్టుకతోనే దేవుడు ఇచ్చిన వరం ఓ అపురూప కుటుంబమే. కుటుంబ వాతావరణమే పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇంధనం. పేదరిక నిర్మూలన, వాతావరణ మార్పుల కట్టడి, లింగ సమానత్వాలు కుటుంబం నుంచే ప్రారంభం కావాలి. శాంతి, సౌభాగ్యాలకు నెలవులు కుటుంబాలు కావాలి. కుటుంబ సహకారం లేకుండా ఏ విజయం కూడా పరిపూర్ణం కాదు. ప్రేమలు వికసించడం, మధుకరా జ్ఞాపకాల నిధులు సాధించడం, నిత్యం నవ్వుల పువ్వులు పూయించడం కుటుంబ కోవెలకు మాత్రమే సుసాధ్యం. పౌర సమాజ వృక్షానికి వివిధ దిశల్లో విస్తరించిన కొమ్మలు, శాఖలే కుటుంబాలని తెలుసుకోవాలి.

మన ఆశ, శ్వాస, ఉనికి, ఊపిరి కుటుంబమే. మన జీవిత ప్రారంభం, అనంత ఆనందాల దేవాలయం కుటుంబమే అని తెలుసుకొని కుటుంబ పునాదులను పటిష్ట పరుచుకుందాం, బాధ్యత కలిగిన రేపటి తరాన్ని బహుకరిద్దాం. ప్రతి గడపకు పసుపు పారాణి, మామిడి తోరణాలు మంగళకరం అయినట్లు, ప్రేమల పునాదుల మీద నిర్మితమైన ఆదర్శ కుటుంబాలు "గృహమే కదా స్వర్గ సీమ" అయితే, "దేశమే సౌభాగ్యాల కోవెల"గా మారుతుంది.



–మధుపాళీ
9949700037

# రోగి పక్కన వైద్యుడి ఉనికిని ఏ కృత్రిమ మేధ కూడా భర్తీ చేయలేదు: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, మే 14:నేడు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) 51వ స్నాతకోత్సవ కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగించారు.

వైద్య సేవలను అందించడంలో ఎయిమ్స్ చేస్తున్న కృషిని ఉపరాష్ట్రపతి కొనియాడారు. వైద్య ఆవిష్కరణల్లో, ఆరోగ్య సంరక్షణలో నాణ్యతతో కూడిన సేవలు అందిస్తూ దేశానికే ఎయిమ్స్ ఒక మార్గదర్శక శక్తిగా ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. రోగుల సంరక్షణ, ఆధునిక వైద్యంలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పుతూనే.. సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో వైద్య సేవలను అందిస్తోందని తెలిపారు. కరోనా వంటి మహమ్మారిని ఎదుర్కోవడంలో.. ఎయిమ్స్ చూపిన తెగువ నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలను విస్తరించడం వరకు.. "ఎయిమ్స్ బ్రాండ్'' భారత్‌తోపాటు ఆగ్నేయాసియా ప్రాంతమంతటా నమ్మకానికి, చిత్తశుద్ధికి మారుపేరుగా మారిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

వైద్య విద్యలో ప్రమాణాలను నెలకొల్పుతూనే, భారీ సంఖ్యలో రోగులకు సమర్థవంతంగా సేవలు అందిస్తున్నందుకు ఎయిమ్స్‌ను ఉపరాష్ట్రపతి అభినందించారు. ఈ విషయంలో కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ఎయిమ్స్ అధ్యక్షుడు శ్రీ జగత్ ప్రకాష్ నడ్డాతో పాటు ఎయిమ్స్ డైరెక్టర్, అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. దశాబ్దాలుగా అద్భుతమైన ప్రతిభతో పాటు నైతికత, మానవత్వం కలిగిన మేధావులను ఎయిమ్స్ దేశానికి అంది స్తోందని, ఇక్కడి పూర్వ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక సంస్థల్లో కీలక పదవులను చేపట్టారని తెలిపారు.

ఈ ఏడాది ప్రారంభంలో అంటార్కిటికాలోని ఒక రోగికి ఎయిమ్స్ రిమోట్ విధానంలో రోబోటిక్ అల్ట్రాసౌండ్ పరీక్షను విజయవంతంగా నిర్వహించడాన్ని ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. ఈ ఘనత ద్వారా భారతీయ వైద్య నైపుణ్యానికి భౌగోళిక సరిహద్దులు అడ్డంకి కావని నిరూపితమైందని వ్యాఖ్యానించారు. వైద్య రంగంలో కృత్రిమ మేధ వినియోగం కోసం ఏర్పాటు చేసిన ఇండో–ఫ్రెంచ్ కేంద్రం వంటి అంతర్జాతీయ సహకారాలను ఆయన ప్రస్తావించారు.

వైద్య సేవలు, వైద్య విద్యలో ఎయిమ్స్ ప్రస్తుతం ప్రపంచ స్థాయి ప్రమాణాలను నెలకొల్పుతోందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. క్యూఎస్ ప్రపంచ ర్యాంకులను ప్రస్తావిస్తూ.. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఎయిమ్స్ 40 స్థానాలు ఎగబాకి అంతర్జాతీయంగా 105వ స్థానానికి చేరుకుందని తెలిపారు. అతి త్వరలోనే ఈ సంస్థ తొలి 100 స్థానాల్లోకి వస్తుందని, భవిష్యత్తులో ప్రపంచంలో నంబర్ వన్ సంస్థగా అవతరిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 2018 నుంచి 2025 వరకు ఎన్ఐఆర్ఎఫ్ వైద్య విభాగంలో ఎయిమ్స్ వరుసగా అగ్రస్థానాన్ని నిలబెట్టుకోవడాన్ని ఆయన ఈ సందర్భం గా గుర్తు చేశారు.

ఎయిమ్స్ అధ్యాపకులు, పరిశోధకుల ప్రతిభను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. ఇక్కడి అధ్యాపకులకు లభించిన పద్మ అవార్డుల్లో ఎయిమ్స్ గొప్పతనం ప్రతిబింబిస్తోందని అన్నారు. ఎయిమ్స్ నుంచి ఇప్పటి వరకు ఇద్దరు పద్మవిభూషణ్, 15 మంది పద్మభూషణ్, 51 మంది పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఉన్నారని వెల్లడించారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం రూపొందించిన ప్రపంచంలోని అగ్రశ్రేణి 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో ఎయిమ్స్‌కు చెందిన 57 మంది అధ్యాపక సభ్యులు చోటు దక్కించుకోవడం విశేషమన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఎయిమ్స్ సంస్థల విస్తరణ జరిగిందని, దీనివల్ల వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయని ఉపరాష్ట్రపతి అన్నారు. వైద్య విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా మరిన్ని వైద్య, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ చేస్తున్న ప్రయత్నాలను ఉపరాష్ట్రపతి అభినందించారు.

పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ.. "ఒకే దేశం, ఒకే ఆరోగ్యం'" దార్శనికతతో మరింత సమగ్రమైన, సమానమైన, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే ఆరోగ్య వ్యవస్థగా భారత్ రూపుదిద్దుకుంటోన్న కీలక తరుణంలో పట్టభద్రులు వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తున్నారని తెలిపారు. వైద్య రంగంలో జాలి, ఆవిష్కరణలు, ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించాలని యువ వైద్యులు, శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులకు ఆయన పిలుపునిచ్చారు.

ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతలు వైద్య రంగంతో పాటు ఇతర రంగాలను విప్లవాత్మకంగా మారుస్తున్నాయని ఉపరాష్ట్రపతి అన్నారు. అయినప్పటికీ రోగి పక్కన ఉండి వైద్యుడు ఇచ్చే భరోసాను ఏ కృత్రిమ మేధ కూడా భర్తీ చేయలేదని తెలిపారు. వైద్య వృత్తిలో మానవత్వం, చిత్తశుద్ధి, సానుభూతిని ఎల్లప్పుడూ కాపాడాలని పట్టభద్రులకు సూచించారు.

పట్టభద్రులైన విద్యార్థులకు అభినందలు తెలియజేస్తూ.. వారు ధరించే తెల్ల కోటు కేవలం వ్యక్తిగత విజయానికి మించిన ఎన్నో అంచనాలను, బాధ్యతలను మోస్తుందని ఉపరాష్ట్రపతి అన్నారు. వినయం, నైపుణ్యం, సేవా దృక్పథంతో సమాజానికి సేవ చేయాలని కోరారు. తమ పని కేవలం వృత్తిపరమైన నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా.. సమాజ శ్రేయస్సు పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబించేలా ఉండాలని హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ఎయిమ్స్ న్యూఢిల్లీ అధ్యక్షులు శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా, ఎయిమ్స్ న్యూఢిల్లీ డైరెక్టర్ ప్రొఫెసర్ నిఖిల్ టాండన్, ఎయిమ్స్ డీన్ ప్రొఫెసర్ రాధిక టాండన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజా ప్రసాద్ రాథ్, అధ్యాపక బృందం, వైద్య నిపుణులు, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు నిలకడగా లేక రైతుల ఆవేదన

**–గన్నీ బ్యాగుల కొరతతో మిల్లర్లకు నేరుగా ధాన్యం తరలిస్తున్న రైతులు**
**–కలగర రైతు భరోసా కేంద్రంలో అవ్యవస్థలపై ఆగ్రహం**

అమరావతి, మే 14: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలోని విస్సన్నపేట మండలం కలగర గ్రామపంచాయతీ పరిధిలో దాల్వా వరి ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో, చేసేదిలేక రైతులే స్వయంగా ట్రాక్టర్ల ద్వారా రైస్ మిల్లర్లకు లూజ్ ధాన్యాన్ని తరలిస్తున్నారు.

కలగర గ్రామం నుంచి పుట్రెల గ్రామ పరిధిలోని రెండు రైస్ మిల్లులకు రైతులు ట్రాక్టర్ ట్రక్కుల ద్వారా ధాన్యాన్ని తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం 100 కేజీల వరి ధాన్యానికి రూ.1,950 చొప్పున అమ్మకాలు జరుపుతూ ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రైతుల ప్రకారం, ట్రాక్టర్ ఒక్క ట్రిప్పుకు రూ.2,000 కిరాయి చెల్లించాల్సి వస్తోంది. అదనంగా ధాన్యం లోడింగ్ కోసం కూలీలకు సుమారు రూ.1,000 వరకు ఇవ్వాల్సి వస్తోంది.

ఒక్క ట్రిప్పుకు సుమారు రూ.3,000 ఖర్చవు తున్నప్పటికీ, ధాన్యం అమ్మిన తర్వాత రైతులకు మిగిలేది చాలా తక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల 8వ తేదీన ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు ఆందోళనకు దిగినట్లు తెలిపారు. అనంతరం అధికారులు గ్రామానికి చేరుకుని మరుసటి రోజు నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించినట్లు చెప్పారు.

అయితే గన్నీ బ్యాగుల కొరత కారణంగా మిల్లర్లు ధాన్యం దిగుమతికి ఆసక్తి చూపడం లేదని అధికారులు రైతులకు వివరించినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం బ్యాగులు సరఫరా అవుతు న్నప్పటికీ, వచ్చిన వాటిలో సగానికి పైగా డ్యామేజ్ బ్యాగులే ఉండటంతో పూర్తిస్థాయిలో వినియోగించలేని పరిస్థితి నెలకొంది.

కొంతమంది రైతులకు గన్నీ బ్యాగులు ఇచ్చి ధాన్యం నింపించిన తర్వాత కూడా కాటా వేసి లారీల్లో లోడింగ్ చేయకపోవడం వల్ల మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

# భారత్ అధ్యక్షతన ముంబయిలో కింబర్లీ ప్రాసెస్ వార్షిక మధ్యంతర సమావేశం- 2026

న్యూ ఢిల్లీ, మే 14:కింబర్లీ ప్రాసెస్ (కేపీ) వార్షిక మధ్యంతర సమావేశం - 2026 భారత్ అధ్యక్షతన ముంబయిలో ప్రారంభమైంది. మే 11 నుంచి 14 వరకు జరగనున్న ఈ సమావేశం.. సహజ వజ్రాల అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించడం లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కింబర్లీ ప్రాసెస్ భాగస్వాములు, పరిశీలకులు, సంబంధిత పారిశ్రామిక వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చింది.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి కింబర్లీ ప్రాసెస్ అధ్యక్షుడు శ్రీ సుచింద్ర మిశ్రా ప్రసంగిస్తూ.. వజ్రాల ఉత్పత్తి చేసే దేశాల్లో శాంతిని నెలకొల్పడంలో, జీవనోపాధిని రక్షించడంలో, చట్టబద్ధమైన వజ్రాల వాణిజ్యాన్ని బలోపేతం చేయడంలో కింబర్లీ ప్రాసెస్ కీలక పాత్ర పోషించిందన్నారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఈ వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పటిష్టం చేయాలని, భాగస్వామ్య దేశాల మధ్య సహకారాన్ని పెంచాలని, కింబర్లీ ప్రాసెస్ ఎల్లప్పుడూ సముచితంగానూ సమర్థంగానూ నిలిచేలా చూడాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే సహజ వజ్రాలు ఒక సుస్థిర ఉత్పత్తి అని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అత్యంత పురోగామి ధ్రువీకరణ వ్యవస్థల్లో ఒకటిగా కింబర్లీ ప్రాసెస్ కొనసాగుతోందని ఆయన వివరించారు.

రాబోయే కొద్ది రోజుల్లో వివిధ కార్యాచరణ బృందాలు, కమిటీల సమావేశాలు, చర్చలతో ఈ వార్షిక మధ్యంతర సమావేశం కొనసాగుతుంది. ప్రధానంగా కింబర్లీ ప్రాసెస్ ధ్రువీకరణ పథకం అమలు, పర్యవేక్షణ, నిబంధనల అమలు యంత్రాంగాలు, సంప్రదాయ పద్ధతుల్లో, నదీ పరివాహక ప్రాంతాల్లో వజ్రాల వెలికితీత, గణాంకాలు, సహజ వజ్రాలకు సంబంధించి ప్రతి దశలోనూ విశ్వాసాన్ని బలోపేతం చేయడానికుద్దేశించిన చర్యలపై ఈ చర్చలు దృష్టి సారిస్తాయి. ఈ వార్షిక మధ్యంతర సమావేశం 2026 మే 14 వరకు కొనసాగుతుంది.

సహజ వజ్రాల రంగంలో ఎదురవుతున్న కొత్త సవాళ్లపై అభిప్రాయాలను పంచుకోవడానికి, నైతిక పద్ధతుల్లో సేకరించిన వజ్రాల పట్ల వినియోగదారుల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు అవసరమైన సమష్టి విధానాలపై చర్చించడానికి ఈ సమావేశం ఒక మంచి వేదికగా నిలుస్తుందని భావిస్తున్నారు.

కేంద్ర వాణిజ్య శాఖ ఉన్నతాధికారులు, కింబర్లీ ప్రాసెస్ భాగస్వామ్య దేశాల ప్రతినిధులు, ప్రపంచ వజ్రాల మండలి సభ్యులు, పౌర సమాజ కూటమి సభ్యులు, సంబంధిత ఇతర వర్గాలు ఈ వార్షిక మధ్యంతర సమావేశంలో పాల్గొంటున్నారు.

2026 సంవత్సరానికి గాను భారత్ అధ్యక్షతన సాగుతున్న ఈ సమావేశాల ప్రధాన ఇతివృత్తం '3 సీ' కేంద్రంగా సాగుతోంది. అవి విశ్వసనీయత (క్రెడిబిలిటీ), నిబంధనల అమలు (కాంప్లయెన్స్), వినియోగదారుల నమ్మకం (కన్స్యూమర్ కాన్ఫిడెన్స్). నిర్మాణాత్మక చర్చలు, అంతర్జాతీయ సహకారం ద్వారా.. బాధ్యతాయుత పద్ధతుల్లో సేకరించిన సహజ వజ్రాల వ్యాపార భవిష్యత్తును మరింత పటిష్టం చేయడంపై ఇది ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

ఐక్యరాజ్యసమితి సాధారణ సభ తీర్మానం 55/56 (2000)కు అనుగుణంగా కింబర్లీ ప్రాసెస్ ధ్రువీకరణ పథకాన్ని (కేపీసీఎస్) నెలకొల్పారు. సంఘర్షణలు లేదా అక్రమ మార్గాల్లో వెలికితీసిన వజ్రాలను చట్టబద్ధమైన వజ్ర వాణిజ్యంలోకి ప్రవేశించకుండా నిరోధించే లక్ష్యంతో ప్రారంభమైన అంతర్జాతీయ కార్యక్రమమిది. ప్రస్తుతం కింబర్లీ ప్రాసెస్‌లో 86 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 60 మంది భాగస్వాములున్నారు. ఇందులో ఐరోపా సమాఖ్య, దాని సభ్య దేశాలన్నీ కలిసి ఒకే కూటమిగా పాల్గొంటున్నాయి.

ప్రపంచ వజ్ర వ్యాపార రంగంలో బాధ్యతాయుత సేకరణ, పారదర్శకత, సుస్థిరతను బలోపేతం చేయడంలో నిబద్ధతను చాటుకుంటూ.. 2026 జనవరి 1న కింబర్లీ ప్రాసెస్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టింది. వజ్రాల కటింగ్, వాటిని మెరుగు పెట్టడంలో ప్రపంచ అగ్రగామి కేంద్రాల్లో ఒకటిగా ఉన్న భారత్.. కింబర్లీ ప్రాసెస్ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎప్పటికప్పుడు కీలక పాత్ర పోషిస్తోంది.

# రైల్వే స్టేషన్‌లో భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహణ

విజయవాడ మే 14: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో గుడివాడ రైల్వే స్టేషన్‌లో గురువారం విస్తృత స్థాయి "భద్రతా అవగాహన మరియు అత్యవసర ప్రతిస్పందన ప్రదర్శన కార్యక్రమం'' నిర్వహించారు. భారతీయ రైల్వే సివిల్ డిఫెన్స్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ప్రయాణికులు, రైల్వే సిబ్బందిలో భద్రతా చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక భద్రత, ప్రథమ చికిత్స, సీపీఆర్/బీఎల్ఎస్, వడదెబ్బ నిర్వహణ, జనసమ్మర్థ నియంత్రణ, రక్షణ చర్యలు, విపత్తు నిర్వహణపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు.



అలాగే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్టీ), మెడికల్ రిలీఫ్ వ్యాన్ (ఎంఆర్వీ) వినియోగంపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమం డీఆర్ఎం మోహిత్ సోనాకియా ఆధ్వర్యంలో, ఏడీఆర్ఎం పి.ఈ.ఎడ్విన్ పర్యవేక్షణలో నిర్వహించగా, సివిల్ డిఫెన్స్ అధికారులు, గుడివాడ స్టేషన్ మేనేజర్ డి.రమేష్, ఆర్‌పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది మరియు రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో "గోల్డెన్ అవర్"లో ప్రాణ రక్షణ చర్యలు చేపట్టే విధంగా సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి శ్రీకారం

**–రైతుపేటలో కీసర పంపింగ్ మెయిన్ పనులకు శంకుస్థాపన..**
**–రూ.39.50 లక్షలతో అభివృద్ధి పనుల ప్రారంభం?**
**–ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యం**
**–ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సౌమ్య**

అమరావతి, మే 14: నందిగామ పట్టణంలోని రైతుపేట ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది.



రూ.39 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న కీసర పంపింగ్ మెయిన్ పనులకు తంగిరాల సౌమ్య గురువారం కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సౌమ్య, ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుపేట ప్రాంతంలో చాలా కాలంగా కొనసాగుతున్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు వంటి మౌలిక సదుపాయాల సారిస్తోం దని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు అందించే దిశగా నిరంతరం కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రాంతీయ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపీటీ 2.0ను సమీక్షించిన కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్

న్యూఢిల్లీ, మే 14:భారత తపాలా శాఖకు చెందిన తదుపరి తరం డిజిటల్ వేదిక ఏపీటీ 2.0పై కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు సమగ్ర సమీక్ష నిర్వహించారు. భారత తపాలా శాఖను ఒక ఆధునిక లాజిస్టిక్స్, సేవల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఏపీటీ 2.0 పాత్రను ఆయన వివరించారు.

ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ, శాఖ కార్యాలయాలకు తక్షణ సమాచారాన్ని అందుబాటులోకి తెస్తూ ఏపీటీ 2.0 వేదిక వాటిని శక్తిమంతంగా తీర్చిదిద్దు తోంద న్నారు. ఇది క్షేత్రస్థాయిలో స్థానిక అవసరాలను విశ్లేషించడానికి, పనితీరును పర్యవేక్షించడానికి, డేటా ఆధారిత నిర్ణయాలను వేగంగా తీసుకోవడానికి దోహద పడుతుందని వివరించారు. అలాగే కృత్రిమ మేధ అనుసంధానం ద్వారా తపాలా శాఖలోని భారీ స్థాయి నిర్వహణ సమాచారాన్ని విశ్లేషించడం, ఫలితాలను అంచనా వేయడం, సాధారణ విధులను ఆటోమేట్ చేయడం సాధ్యమవుతుంది. ఇది మొత్తం పోస్టల్ వ్యవస్థలో సేవల నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుందని ఆయన తెలిపారు.

ఈ నరికొత్త సాంకేతిక సామర్థ్యాలు భారత తపాలా శాఖకు స్పష్టమైన ప్రయోజనాలను అందిస్తున్నాయని డాక్టర్ పెమ్మసాని పేర్కొన్నారు. వేగవంతమైన సేవలు, మానవ ప్రమేయం తగ్గడం, మెరుగ్గా నిర్ణయాలు తీసుకోవడం, వినియోగదారుల్లో సంతృప్తి వంటి సానుకూల మార్పులు దీని ద్వారా సాధ్యమవుతున్నాయని వివరించారు. వీటితోపాటు కార్యకలాపాలు మరింత విశ్వసనీయంగా, సమర్థంగా మారుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

ఈ వేదిక ద్వారా కలిగే బలమైన వాణిజ్య ప్రయోజనాలను మంత్రి వివరించారు. ముఖ్యంగా ఇప్పటికీ సరైన సేవలు అందని గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లోని వినియోగదారులను గుర్తించి, వారికి సేవలందించేందుకు ఇదెంతో దోహదపడుతుందన్నారు. శాఖా కార్యాలయాల స్థాయిలో సేవల వినియోగాన్ని పెంచడానికి, డేటా ఆధారంగా ఆదాయ మార్గాలను మెరుగుపరుచుకోవడానికి ఇది తోడ్పడుతుందన్నారు. క్షేత్రస్థాయి సమాచారాన్ని క్రియాశీల మేధగా మార్చడం ద్వారా.. ప్రస్తుత లాజిస్టిక్స్ రంగంలో భారత తపాలా శాఖ పోటీతత్వాన్ని ఏపీటీ 2.0 మరింత బలోపేతం చేస్తోందని ఆయన వెల్లడించారు.

డిజిటల్ సాధికార, సేవే ప్రాతిపదికగా నడిచే సంస్థగా ఉండాలన్న లక్ష్యానికి అనుగుణంగా లాజిస్టిక్స్ రంగంలో దేశానికి వెన్నెముకగా భారత తపాలా శాఖ నిలవడంలో ఈ మార్పు ప్రధాన కేంద్రంగా ఉంటుందని సహాయమంత్రి అభిప్రాయపడ్డారు.

ముఖ్యంగా క్షేత్రస్థాయి నుంచి ఈ పథకం అమలును భారత ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ ప్రత్యక్ష పాలన విధానానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. దీనివల్ల సంస్థ పని సంస్కృతిలో స్పష్టమైన పరివర్తన కనిపిస్తోందన్నారు. పాతకాలం నుంచి కొనసాగుతున్న వ్యవస్థ స్థానంలో వేగంగా స్పందించే, కార్పొరేట్ తరహా, సాంకేతికత ఆధారంగా నడిచే సంస్థగా భారత తపాలా శాఖ రూపుదిద్దుకుంటోందని ఆయన వెల్లడించారు.

సమాచార సమగ్రతను కాపాడటమే కాకుండా, సైబర్ భద్రతను పటిష్టం చేసే ఒక బలమైన, సురక్షితమైన నిర్మాణాన్ని ప్రభుత్వ డిజిటల్ విధానం ఏర్పరుస్తోందని డాక్టర్ పెమ్మసాని వ్యాఖ్యానించారు. ఇది నమ్మకమైన, పటిష్టమైన, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉండే డిజిటల్ ప్రజా సేవలను అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విస్తరిస్తున్న భారత డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలపై విశ్వాసాన్ని ఇది మరింతగా పెంచుతుందని, ఇక్కడ సేవల విస్తృతికి భద్రత, నమ్మకం కూడా తోడవుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా నేతృత్వంలో వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా భారత తపాలా శాఖ స్థిరంగా పరివర్తనను కొనసాగిస్తోంది. సాంకేతికతను వినియోగించడం ద్వారా దేశవ్యాప్త అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా క్షేత్రస్థాయి వరకు సమర్థంగా సేవలందిస్తోంది.

# ఏసీఏ ఆధ్వర్యంలో వికెట్‌కీపింగ్ ప్రత్యేక శిక్షణ శిబిరం

విశాఖపట్నం, మే 14: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని ఏసీఏ నార్త్ జోన్ అకాడమీలో వికెట్‌కీపర్ల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. భారత మాజీ వికెట్‌కీపర్ కిరణ్ మోర్ ఈ శిక్షణ కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహించారు.

కిరణ్ మోర్ ఉదయం 9 గంటలకు అకాడమీకి చేరుకుని తన అంతర్జాతీయ క్రికెట్ అనుభవాలను యువ ఆటగాళ్లతో పంచుకున్నారు. వికెట్‌కీపింగ్‌లో మెళకువలు, మ్యాచ్ పరిస్థితుల్లో అప్రమత్తత, ఫిట్‌నెస్, గ్లోవ్ వర్క్ వంటి అంశాలపై ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చారు.

రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి కొత్త ఆలోచనలతో ఏసీఏ ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. ఏసీఏ అధ్యక్షుడు కేసినేని చిన్ని, కార్యదర్శి సాన సతీష్ బాబు కిరణ్ మోర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్ర క్రికెట్ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం అమూల్యమని కొనియాడారు.

యువ ప్రతిభను వెలికితీసి రాష్ట్ర క్రికెట్ ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు.

# 2026 నుంచి 2033 వరకు ఎనిమిదేళ్ల కాలానికిగానూ వ్యూహాత్మక అవకాశాల కార్యక్రమం (సీఓఎస్ఓపీ) ప్రారంభం

న్యూఢిల్లీ, మే 14:అంతర్జాతీయ వ్యవసాయ అభివృద్ధి నిధి (ఐఎఫ్ఏడీ) భాగస్వామ్యంతో భారత ప్రభుత్వం.. 2026 నుంచి 2033 వరకు ఎనిమిదేళ్ల కాలానికి దేశ వ్యూహాత్మక అవకాశాల కార్యక్రమాన్ని (సీఓఎస్ఓపీ) ప్రారంభించింది. భారతదేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రజల ఆదాయాన్ని పెంచటం, సుస్థిరతను బలపరచటం, స్థిరమైన ఉపాధి అవకాశాలను విస్తరించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఐఎఫ్ఏడీ–గ్రామీణ వికాసానికి భారత భాగస్వామ్యం కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఐఎఫ్ఏడీ యాజమాన్యం, అభివృద్ధి భాగస్వాములు, ప్రైవేట్ రంగ ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి శ్రీమతి అనురాధా ఠాకూర్ ప్రసంగిస్తూ.. "భారత్–ఐఎఫ్ఏడీ భాగస్వామ్యం సుదీర్ఘమైనది మాత్రమే కాదు.. వ్యూహాత్మకమైనది. భారత్‌లో ఐఎఫ్ఏడీ కార్యక్రమాలు జాతీయ ప్రాధాన్యతలతో మమేకమై.. వ్యవసాయ రంగంలో మార్పు, జీవనోపాధిలో వైవిధ్యత, మహిళా సాధికారత, సంస్థాగత బలోపేతానికి మద్దతిస్తాయి"

"కాలక్రమేణా పేదరిక నిర్మూలనపైనే కాక.. వాతావరణ మార్పులను, ఆర్థిక ఒడిదొడుకులను తట్టుకోగలిగేలా, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా స్థిరమైన గ్రామీణ జీవనోపాధిని కల్పించటంపై దృష్టి మళ్లింది" అని ఆమె అన్నారు.

అంతర్జాతీయ వ్యవసాయ అభివృద్ధి నిధి (ఐఎఫ్ఏడీ) అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డోనాల్ బ్రౌన్ ప్రసంగిస్తూ.. "మనం కలిసి నిర్మిస్తున్నది కేవలం కొన్ని ప్రాజెక్టులు మాత్రమే కాదు. సంస్థలను, ఆర్థిక వనరులను, మౌలిక సదుపాయాలను, మార్కెట్లను అనుసంధానించే ఒక వ్యవస్థ. ఒక పెట్టుబడి ముగిసిన తర్వాత కూడా ఇది గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలిక ఫలితాలను అందిస్తుంది. అత్యంత విలువైన ఈ భాగస్వామ్యం ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసేందుకు వీలుగా ఉంటుంది" అని అన్నారు.

ఈ కొత్త వ్యూహం.. స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీలు), రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు), సహకార సంఘాల వంటి గ్రామీణ స్థాయి సంస్థలను బలోపేతం చేయటంపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఆర్థిక సహాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, మార్కెట్లను అనుసంధానించే కీలక వేదికలుగా ఇవి పనిచేస్తాయి.

గత రెండు దశాబ్దాలుగా భారతదేశంలో ఐఎఫ్ఏడీ మద్దతుతో చేపట్టిన కార్యక్రమాలు అద్భుతమైన ఫలితాలను సాధించాయి. ముఖ్యంగా ఎస్‌హెచ్‌జీల ద్వారా మహిళలకు పెద్దఎత్తున ఆర్థిక సాయం అందించటంలో, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రైతులకు మార్కెట్ సదుపాయాలను మెరుగుపరచటంలోనూ ఇవి కీలక పాత్ర పోషించాయి. ఉత్పత్తులకు విలువ జోడింపు, ఈ–కామర్స్ అనుసంధానం ద్వారా మహిళల నేతృత్వంలోని వ్యాపార సంస్థలను అభివృద్ధి చేయటంలో ఈ కార్యక్రమాలు ఎంతో ప్రభావం చూపాయి.

గ్రామీణాభివృద్ధిలో జ్ఞాన నాయకత్వ కేంద్రంగా భారతదేశాన్ని నిలపటం కూడా ఈ సీఓఎస్ఓపీ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా సమ్మిళిత గ్రామీణ ఆర్థిక సేవలు, సహకార పాలన, డిజిటల్ వ్యవసాయ సేవలు, వాతావరణ మార్పులను తట్టుకోగల విలువైన వ్యవస్థల వంటి విజయవంతమైన నమూనాలను ఆఫ్రికా, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికాలోని భాగస్వామ్య దేశాలతో పంచుకునేందుకు ఇది దోహదపడుతుంది.

ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను మరింత బలోపేతం చేయటానికి, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆవిష్కరణలకు మద్దతిచ్చేందుకు ఐఎఫ్ఏడీ, నాబార్డ్ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి.

భారత్, ఐఎఫ్ఏడీ మధ్య దాదాపు ఐదు దశాబ్దాలుగా భాగస్వామ్యం కొనసాగుతోంది. అనేక రాష్ట్రాల్లో 35 గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులను అమలు చేయటం ద్వారా కోట్లాది గ్రామీణ కుటుంబాలకు చేయూతనివ్వటమే కాక, సమగ్రాభివృద్ధికి ఈ భాగస్వామ్యం సహకరించింది.

గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరచటం, స్థిరత్వాన్ని నెలకొల్పటం, సుస్థిరాభివృద్ధికి ఆవిష్కరణలను వినియోగించుకోవటంతో పాటు ప్రపంచ అభివృద్ధి సహకారానికి తోడ్పడాలనే భారత ప్రభుత్వ నిబద్ధతను నూతన సీఓఎస్ఓపీ స్పష్టం చేస్తుంది.

# 1.5 బిలియన్ డాలర్ల 'భారత్ నౌకా వాణిజ్య బీమా నిధి'ని ప్రారంభించిన ఆర్థిక సేవల విభాగం

న్యూఢిల్లీ, మే 14:కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి అధ్యక్షతన ఈ రోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో 'భారత్ నౌకా వాణిజ్య బీమా నిధి (బీఎంఐపీ)ని ప్రారంభించారు. అంతరాయం లేకుండా నౌకా వాణిజ్య బీమా సౌకర్యాన్ని కల్పించడం కోసం 1.5 బిలియన్ డాలర్ల విలువైన ఈ దేశీయ బీమా నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి 1.4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 12,980 కోట్లు) సార్వభౌమ హామీని భారత ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ నౌకలు లేదా భారత్ నియంత్రణలో ఉన్న నౌకలు లేదా భారత్ నుంచి వెళ్లే/ భారత్‌కు వచ్చే నౌకలకు ఎదురయ్యే అవకాశమున్న కొన్ని రకాల ముప్పుల నుంచి ఈ నిధి రక్షణ కల్పిస్తుంది. ఓడ స్థూల భాగాలు – యంత్రాలకు వాటిల్లే నష్టం, నరుకు, రక్షణ – పరిహారం, యుద్ధ ప్రమాదాల వంటి అన్ని నౌకా వాణిజ్య ముప్పులతో వాటిల్లే నష్టాలు ఈ నిధి పరిధిలోకి వస్తాయి.

ప్రత్యేక కార్యదర్శి శ్రీ సంజయ్ లోహియా, అదనపు కార్యదర్శి శ్రీ దేబాశిష్ ప్రుస్టీ, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ శ్రీ హితేశ్ జోషి, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ సీఎండీ శ్రీమతి గిరిజా సుబ్రమణియన్, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ శ్రీమతి కస్తూరి సేన్‌గుప్త, ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ శ్రీ ఓపేశ్ కుమార్ శర్మ సహా ఆర్థిక సేవల విభాగానికి చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హోగర్ ఆఫ్‌షోర్ అండ్ మెరైన్ సంస్థకు.. బీఎంఐపీ కింద న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ జారీ చేసిన మొదటి నౌకా నిర్మాణ – యంత్ర యుద్ధ విధాన పత్రాన్ని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి శ్రీ ఎం. నాగరాజు అందించారు. యుద్ధ ముప్పు పొంచి ఉన్న అత్యంత ప్రమాదకరమైన సముద్ర ప్రాంతాల్లో ప్రయాణించే సమయంలో నౌకలకు ఇది ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. అలాగే కేబుల్ వైర్ల దిగుమతి కోసం వేదాంత స్టెరిలైట్ కాపర్ సంస్థకు కూడా సముద్ర సరుకు రవాణా యుద్ధ విధాన పత్రాన్ని అందించారు. బలరాంపూర్ చిని మిల్స్ సంస్థకు కూడా ఈ తరహా విధానపత్రాలను జారీ చేశారు.

అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో లేదా ఆంక్షలు ఉన్న ప్రదేశాల మధ్య సాగే నౌకాయానానికి బీమా కవరేజీని నిలిపివేయడం లేదా పరిమితం చేయడం వల్ల రవాణా కార్యకలాపాలు, కీలక వాణిజ్య ప్రవాహాలకు అంతరాయం కలుగుతుంది. ఆంక్షలను ఎదుర్కొంటున్న దేశం నుంచి వచ్చే నరుకు లేదా సరుకును తీసుకువెళ్లే నౌకకు వర్తించే ఏదైనా బీమా పాలసీకి.. తిరిగి బీమా చేసే విదేశీ సంస్థలు (రీఇన్సూరర్లు) ఈ ఆంక్షల కారణంగా మద్దతును ఉపసంహరించుకునే అవకాశముంటుంది. రక్షణ, పరిహారం (పీఐ) బీమా కోసం భారతీయ నౌకలు అంతర్జాతీయ రక్షణ – పరిహార క్లబ్బులపైనే ఆధారపడుతుండడం మరో ఆందోళనకరమైన అంశం. చమురు కాలుష్యం, శిథిలాల తొలగింపు, నరుకు నష్టం, సిబ్బందికి గాయాలు, నౌకల మధ్య జరిగే ప్రమాదాల వంటి థర్డ్ పార్టీ బాధ్యతలకు ఈ పీ అండ్ ఐ బీమా రక్షణ కల్పిస్తుంది. సార్వభౌమిక హామీతో కూడిన ఈ బీమా నిధి.. నష్టభయాలను ఎదుర్కొనేందుకు సరిపడా పూచీని సమర్థంగా అందిస్తుంది. తద్వారా నౌకావాణిజ్యంపై దేశానికి పూర్తి స్థాయి నియంత్రణను మరింత మెరుగుపరుస్తుంది.

ఈ బీమా నిధి పనితీరును పర్యవేక్షించడానికి ఒక పాలక మండలిని ఏర్పాటు చేశారు. సార్వభౌమిక హామీ వినియోగానికి సంబంధించిన ఆమోదాలపై ఇది నిర్ణయాలు తీసుకుంటుంది. దీనితోపాటు నిధికి ఎదురయ్యే అవకాశమున్న సంకటాలను విచక్షణతో, స్థిరంగా, సాంకేతికంగా విశ్లేషించడం కోసం ఒక పూచీకత్తు కమిటీని (అండర్ రైటింగ్ కమిటీ) కూడా ఏర్పాటు చేశారు. ఈ నిధికి పాలక బాధ్యతల్లో జీఐసీ వ్యవహరిస్తుంది. రిటర్నులు, పునర్ భీమా వివరాలు, నిధి పనితీరుపై నివేదికలను ఈ సంస్థ సమర్పిస్తుంది.నిధి ఉమ్మడి పూచీ సామర్థ్యాన్ని ఉపయోగించుకుని.. ఈ నిధిలో సభ్యత్వమున్న దేశీయ బీమా సంస్థలు పాలసీలను జారీ చేస్తాయి. ఈ రిస్కులకు నిధిలోని సభ్య సంస్థలన్నీ అవి అంగీకరించిన వాటా నిష్పత్తిలో తిరిగి బీమా చేస్తాయి.

100 మిలియన్ డాలర్ల వరకు వచ్చే బీమా క్లెయింలను ఈ నిధి స్వయంగా పరిష్కరిస్తుంది. ఒకవేళ క్లెయిమ్ మొత్తం 100 మిలియన్ డాలర్ల కన్నా ఎక్కువగా ఉంటే వాటిని పరిష్కరించడం కోసం సార్వభౌమిక హామీని అమలు చేస్తారు. అయితే నిధిలో ఉన్న నిల్వలు, సభ్యుల వాటాలు, తిరిగి చేసిన బీమా ఏర్పాట్లన్నీ పూర్తిగా ఖర్చయి పోయిన తర్వాతే.. చివరి ఆయుధంగా దీనిని వినియోగిస్తారు.

ఈ బీమా నిధి నౌకావాణిజ్యంపై దేశ సార్వభౌమ నియంత్రణను బలోపేతం చేయడంతో పాటు.. ఆంక్షలు లేదా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా విదేశీ బీమా సంస్థలు పునర్ భీమా కవరేజీని ఉపసంహరించుకున్నా మన వాణిజ్యం అంతరాయం లేకుండా నడిచేలా చూస్తుంది. నౌకావాణిజ్య ముప్పులను ఎదుర్కోవడంలో దేశ రక్షణ వ్యవస్థను ఇది పటిష్టం చేస్తుంది. భవిష్యత్తులో సురక్షితమైన అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాలకు మద్దతుగా నిలుస్తూ.. దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని పెంపొందిస్తుంది.

# ఘనంగా మంత్రి పయ్యావుల దినోత్సవం వేడుకలు

## 10వ తరగతి పరీక్షలలో అధిక మార్పులు సాధించి సత్తా చాటిన విద్యార్థులకు నగదు పంపిణీ పారిశుధ్య కార్మికులకు వస్త్రదానం

అమరావతి, మే 14:రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 62వ జన్మదిన వేడుకలు మండల వ్యాప్తంగా




ఘనంగా జరిగాయి మండలం లోని వివిధ గ్రామాలలో టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మంత్రి పయ్యావుల కేశవ్ పుట్టినరోజును పెద్దఎత్తున జరుపుకున్నారు. ఉరవకొండ లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్దనుండి అనంతపురం బైపాస్, కనేకల్ క్రాస్, గాంధీ చౌక్, సుబ్రహ్మణ్యం గుడి, కెనరా బ్యాంక్, టవర్ క్లాక్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, మండలంలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు దాదాపు 260 మందికి వస్త్ర దానం చేశారు.

10వ తరగతి పరీక్షలలో అధిక మార్కులు సాధించి సత్తా చాటిన 16 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయలు నగదును అందజేశారు. మండలంలో టాపర్ గా నిలిచిన చిన ఉరవకొండ ఎస్.కె ప్రభుత్వ హైస్కూల్ కు చెందిన నక్షత్రకు 10 వేల రూపాయలను అందజేశారు. టవర్ క్లాక్ వద్ద భారీ కేక్ కట్ చేసి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి ప్రసాద్, ఎంఈవో ఈశ్వరప్ప, తహసిల్దార్ భోగన్న గౌడ్, సీఐ మహానంది, ఉరవకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయభాస్కర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవినేని పురుషోత్తం, ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ కండక్టర్ తిమ్మప్ప, పెన్నాహోబిలం ధర్మకర్తల మండలి చైర్మన్ రేగటి నాగరాజు, ఉరవకొండ సింగల్ విండో సహకార సంఘం అధ్యక్షులు ప్యారం కేశవానంద, మాజీ సర్పంచులు ఇంద్రావతి ఎర్రగుంట్ల వెంకటేశులు, మోపిడి మాజీ సర్పంచ్ గోవిందు, బూదగవి మాజీ సర్పంచ్ చత్రగుడి చిరంజీవి, మాజీ ఎంపీపీలు కుల్లాయప్ప సుంకరత్నమ్మ, నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి గుర్రం సుధాకర్, పెద్ద కొట్టాలపల్లి మాజీ సర్పంచ్ గొర్తి రంగనాయకులు టిడిపి నాయకులు బోస్, కట్టుబడి ఖలందర్, దండా కృష్ణ ప్రసాద్, మాజీ ఎంపిటీసీ సుంకన్న, రఘు రాములు, వన్నారెడ్డి, మాజీ వార్డు సభ్యులు మీనుగ రామాంజనేయులు, పెద్ద ముష్టూర్ మీనుగ రామకృష్ణ, ఇంద్రావతి సుధాకర్, వరప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

# దీవుల అభివృద్ధికి అపర భగీరథుడు మండలి వెంకట కృష్ణారావు

అమరావతి, మే 14: దీవుల అభివృద్ధికి అలుపెరగని విక్రమార్కునిలా స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు కృషి చేశారని ఎదురుమొండి వాసులు స్మరించుకున్నారు. గురువారం నాగాయులంక మండలం ఎదురుమొండి దీవిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆయన శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

శత జయంతి నిర్వహణ కమిటీ, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 1956 నుంచే మండలి వెంకట కృష్ణారావు ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ దీవుల అభివృద్ధి కోసం ప్రభుత్వాల దృష్టికి సమస్యలను తీసుకెళ్లారని తెలిపారు. సముద్రపు కరకట్టలు, నీటి ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, సాగునీటి సౌకర్యాలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కోసం ఆయన నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు.

దీవుల అభివృద్ధి కోసం అనేకసార్లు ఢిల్లీ, హైదరాబాద్, ముంబై ప్రాంతాల్లో పర్యటించి నిధులు సాధించారని తెలిపారు. కృష్ణానది వెస్ట్ బ్యాంక్ కెనాల్ ద్వారా పైప్‌లైన్ల ఏర్పాటు చేసి సాగునీరు అందించేందుకు కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ దీవుల్లో వేలాది ఎకరాలను సాగులోకి తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు.

1977 దివిసీమ ఉప్పెన సమయంలో కెనడాకు చెందిన సిడా సంస్థ సహకారంతో సహాయక చర్యలు చేపట్టడంతో పాటు ఆరోగ్య పథకాలు అమలు చేశారని తెలిపారు. తుఫాను షెల్టర్లు, రిజర్వాయర్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయించి దీవుల ప్రజల జీవన ప్రమాణాలు




మెరుగుపరిచారని పేర్కొన్నారు.

శత జయంతి సభలో పలువురు గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ దీవుల అభివృద్ధికి మండలి వెంకట కృష్ణారావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

ఎదురుమొండి జడ్పీ హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, హెచ్ఎం బడే లలిత కుమారి, ఉపాధ్యాయుడు సీహెచ్ నాగప్రసాద్‌ను ఎమ్మెల్యే సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పల్లెం పెద్దేశ్వర్ హాస్పిటల్, అమరావతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. మొత్తం 281 మందికి గుండె, ఎముకలు, కీళ్ళు, నేత్ర, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తదుపరి చికిత్సకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నా-యార్లగడ్డ వెంకట్రావు

అమరావతి, మే 14:చెప్పింది చేస్తా.. చేసేదే చెప్తా అని చెప్పిన విధంగా గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామం నుంచి నారయ్య అప్పారావుపేట వరకు రూ.1.12 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన రోడ్డును స్థానిక నాయకులతో కలిసి యార్లగడ్డ ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి రోడ్డును ప్రజలకు అంకితం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మీడియాతో మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న స్థితిలో ఉండేదని, కనీసం కార్లు, ట్రాక్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొనేదని గుర్తు చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పదేళ్లుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిన్న గ్రామం అని వివక్ష చూపకుండా ఎన్ఆర్జీఎస్ నిధులతో రోడ్డును పూర్తి చేశామని తెలిపారు.

పొట్టిపాడు గ్రామ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.4.25 కోట్ల పనులు మంజూరు చేశామని ఆయన వెల్లడించారు. జిల్లా పరిషత్ నిధులతో రూ.25 లక్షల వ్యయంతో మరో రహదారి పనులు త్వరలో ప్రారంభమవుతాయని, వంతెన రైలింగ్ పనులు కూడా చేపడతామని హామీ ఇచ్చారు. చెరువుల తవ్వకాల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

ప్రభుత్వం అనుమతించిన మేరకు రెండు నుంచి మూడు అడుగుల లోతు వరకు మాత్రమే మట్టి తీయాలని, అంతకుమించి తవ్వితే ఎవరైనా సరే కేసులు నమోదు చేస్తామని అన్నారు. గతంలో చెరువులను అధిక లోతులో తవ్వడం వల్ల అనేక ప్రమాదాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల నుంచి తీసే మట్టిని ముందుగా పేదల ఇళ్ల స్థలాలు మెరక చేసేందుకు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాల నిర్మాణాలకు వినియోగించాలని సూచించారు.

వర్షాకాలం వచ్చేలోపు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో ఈ పనులు పూర్తి చేయాలని అధికారులకు నిర్దేశించారు. చెప్పింది చేస్తా.. చేసేదే చెప్తా అనే నినాదంతో గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పునరుద్ఘాటించారు. అనంతరం స్వచ్ఛ రథాన్ని యార్లగడ్డ ప్రారంభించారు.

ఉంగుటూరు మండల ఎంపీడీఓ ఈ. సత్యకుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, గ్రామ టిడిపి అధ్యక్షులు ఈ. రవికుమార్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, అట్లూరి నాని, గూడపాటి వెంకటేశ్వరరావు, తాటిపాముల నాగయ్య, గుద్దేటి సుమతి, ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, కొండేటి వెంకటేశ్వరరావు, మేడేపల్లి రమ, బెజవాడ నాగేశ్వరరావు, బోనం సూరిబాబు, పెంటపాటి సీతయ్య, రమేష్, యలమర్తి నిఖిల్, రాజబోయిన శివాజీ, కొసరాజు సాయిరాం, ఎర్రగుంట్ల వినోద్, నిమ్మకూరి మహేష్, రమేష్, షేక్ సుభాని, షేక్ వలి, అట్లూరి సురేంద్ర, కడియాల బాబు, వేమారెడ్డి శ్రీనివాసరావు, కొల్లి విష్ణు, గరిమెళ్ళ వరప్రసాద్, అన్నే చైతన్య, కొమ్మారెడ్డి రాజేష్, నిమ్మకూరి మధు, చల్లగుల్ల సందీప్, కొల్లూరు పాల్గొన్నారు.

# పీఎం ఈ-డ్రైవ్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనపై జాతీయ సదస్సు

న్యూఢిల్లీ, మే 14:భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఈవీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: హెచ్.డీ. కుమారస్వామి

''పీఎం ఈ-డ్రైవ్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పన''పై భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఐ) మే 12, 2026న బెంగళూరులో జాతీయ సదస్సును నిర్వహించింది.

సదస్సులో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి శ్రీ హెచ్.డీ. కుమారస్వామి మాట్లాడుతూ.. దేశంలో స్వచ్ఛ రవాణాకు మద్దతుగా ఆధునిక, నమ్మకమైన ఈవీ ఛార్జింగ్ వ్యవస్థను రూపొందించేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలను పట్టణ ప్రాంతాల్లోనే కాక, గ్రామీణ భారతానికి అందుబాటులోకి తీసుకురావాలని, తక్కువ ధరలో విశ్వసనీయమైన ప్రయాణాన్ని అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని తెలియజేశారు. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారీ స్థాయిలో ఈవీల వినియోగాన్ని వేగవంతం చేసేందుకు ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయటం అత్యవసరమని స్పష్టం చేశారు.

కర్ణాటకలో రూ.123.26 కోట్ల వ్యయంతో 1,243 ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలకు గౌరవ మంత్రి ఆమోదం తెలిపారు. ఇప్పటివరకు వివిధ రాష్ట్రాలు, సీపీఎస్ఈల పరిధిలో మొత్తం 4,874 ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటునకు రూ. 503.86 కోట్ల వ్యయంతో కూడిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ ఆమోదిత ప్రతిపాదనల్లో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ వంటి ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కేరళ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయి.

భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ హనిఫ్ ఖురేషీ మాట్లాడుతూ.. అవాంతరాలు లేని, భవిష్యత్తు అవసరాలకు అనువైన ఈవీ ఛార్జింగ్ వ్యవస్థను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు పీఎం ఈ-డ్రైవ్ పథకం కీలకమని అన్నారు. ఎలక్ట్రిక్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, ట్రక్కుల ఛార్జింగ్ వ్యవస్థలకు ఎంహెచ్ఐ మద్దతిస్తుందని ఆయన తెలిపారు. దేశంలో తదుపరి తరం విద్యుత్ రవాణా అభివృద్ధికి అవసరమైన సమర్థవంతమైన ఛార్జింగ్ వ్యవస్థను రూపొందించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బీహెచ్ఈఎల్, ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లు, పరిశ్రమ భాగస్వాముల మధ్య సమన్వయం కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు.

పీఎం ఈ-డ్రైవ్‌తో పాటు ఈవీలను ప్రోత్సహించేందుకు ఎంహెచ్ఐ పలు పథకాలను అమలు చేస్తోంది. అవి.. పీఎల్ఐ ఆటో (రూ. 25,938 కోట్లు), పీఎల్ఐ ఏసీసీ (రూ. 18,100 కోట్లు), పేమెంట్ సెక్యూరిటీ మెకానిజం (రూ. 3,435 కోట్లు), అరుదైన ఖనిజ అయస్కాంతం కోసం ఉద్దేశించిన పథకం (రూ. 7,280 కోట్లు).

దేశవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను వేగవంతం చేయటంపై దృష్టి సారించిన సమావేశం

దేశవ్యాప్తంగా ఈవీ పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల (ఈవీ పీసీఎస్) విస్తరణను వేగవంతం చేయటం, భారత ఎలక్ట్రిక్ మొబిలిటీ వ్యవస్థను బలోపేతం చేయటం వంటి అంశాలపై చర్చించేందుకు కీలక వేదికగా ఈ సమావేశం నిలిచింది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉన్నతాధికారులు, ఛార్జ్ పాయింట్ ఆపరేటర్లు (సీపీఓలు), ఈవీ తయారీదారులు (ఓఈఎంలు), చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు), కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈలు), ఆటోమొబైల్ పరిశ్రమ సంఘాలు, ఇతర కీలక వాటాదారులు పాల్గొన్నారు.

ఉత్తమ పద్ధతులు, అమలు వ్యూహాలను పంచుకున్న రాష్ట్రాలు

ఈ సమావేశానికి తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఇంధన శాఖ) ఐఏఎస్ శ్రీ నవీన్ మిట్టల్, కేరళ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి (విద్యుత్ శాఖ) ఐఏఎస్ శ్రీ పునీత్ కుమార్, కేరళ ప్రభుత్వ కేఎస్ఈబీ, సీఎండీ శ్రీ మిన్హాజ్ ఆలం, కర్ణాటక ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి (ఇంధన శాఖ) శ్రీ గౌరవ్ గుప్తా, ఒడిశా ప్రభుత్వ రవాణా కమిషనర్ శ్రీ అమితాబ్ ఠాకూర్ వంటి సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈవీ ఛార్జింగ్ కేంద్రాల విస్తరణ, వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంబంధించి అనుభవాలను, విధానపరమైన నిర్ణయాలను, రాష్ట్ర స్థాయి వ్యూహాలను అధికారులు పంచుకున్నారు.

పీఎం ఈ-డ్రైవ్ పథకం ద్వారా దేశవ్యాప్త ఛార్జింగ్ నెట్‌వర్క్ విస్తరణ

పీఎం ఈ-డ్రైవ్ పథకం ద్వారా విద్యుత్ వాహన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, ఈవీ వ్యవస్థ అభివృద్ధికి మద్దతుగా రూ.10,900 కోట్లను కేటాయించేందుకు భారత ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పథకం వివిధ వాహన వర్గాలు, విడిభాగాల విషయంలో డిమాండ్ ప్రోత్సాహకాలను, మౌలిక సదుపాయాల మద్దతును అందిస్తుంది. ఈ పథకం ద్వారా సుమారు 24.79 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు (ఈ-2డబ్ల్యూ), ఈ-రిక్షాలు, ఈ-కార్టులు, ఎల్5 కేటగిరీ వాహనాలతో కలిపి దాదాపు 3.16 లక్షల ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలకు (ఈ-3డబ్ల్యూ) ప్రోత్సాహకాలను అందించాలని, అదనంగా 14,028లకు పైగా ఎలక్ట్రిక్ బస్సుల వినియోగానికి రూ. 4,391 కోట్ల ఆర్థిక సాయం అందించాలని ప్రతిపాదించారు. వాణిజ్య, ప్రజా సేవా రంగాల్లో వీటి వినియోగాన్ని ప్రోత్సహింతచేందుకు ఈ-అంబులెన్స్‌లు, ఈ-ట్రక్కులకు కూడా ప్రత్యేక కేటాయింపులు చేశారు.

మొత్తం కేటాయింపుల్లో రూ.3,679 కోట్లను ఈ-2డబ్ల్యూలు, ఈ-3డబ్ల్యూలు, ఈ-అంబులెన్సులు, ఈ-ట్రక్కులు, ఇతర అభివృద్ధి చెందుతున్న ఈవీ విభాగాలకు ప్రోత్సాహకంగా అందించేందుకు కేటాయించారు.

దేశవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లు కేటాయించారు. అదనంగా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వాహన పరీక్షా సంస్థల ఆధునీకరణ, ఉన్నతీకరణకు రూ. 780 కోట్లు కేటాయించారు.

విస్తరించగల, విశ్వసనీయమైన ఈవీ మౌలిక సదుపాయాలకు కీలక సహకారం

దేశవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల విస్తరణ, పరస్పర అనుసంధానత, ప్రామాణీకరణ, విశ్వసనీయతతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, ఓఎంసీలు, ఓఈఎంలు, సీపీఓలు, అమలు సంస్థల మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని ఈ సదస్సు స్పష్టం చేసింది. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈవీ వ్యవస్థకు మద్దతుగా ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించటం, ఉమ్మడి సాంకేతిక ప్రమాణాలను పాటించటం, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరముందని ప్రతినిధులు తెలిపారు.

స్వచ్ఛ రవాణా లక్ష్యాల పట్ల నిబద్ధతను స్పష్టం చేసిన ఎంహెచ్ఐ

భారతదేశంలో ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను వేగంగా ఏర్పాటు చేసేందుకు రాష్ట్రాలకు, సంబంధిత సంస్థలకు పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మరోసారి స్పష్టం చేసింది. 2070 నాటికి కర్బన ఉద్గారాలను పూర్తిగా తగ్గించటం, వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను సాధించటంలో స్వచ్ఛ రవాణా వ్యవస్థ కీలకమని మంత్రిత్వ శాఖ తెలిపింది.

# తండ్రి లేని యువతి పెళ్లికి ఎమ్మెల్యే అండ

నల్గొండ, మే 14:నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన షాహిదా భర్తను కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో తన కుమార్తె వివాహం నిర్వహించేందుకు ఆర్థిక సహాయం కోసం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా రూ. 1,00,000 ఆర్థిక సహాయం మంజూరు చేశారు.

ఈ మేరకు చెక్కును మునుగోడు పట్టణ నాయకులు పెళ్లి కూతురుకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్,మాజీ సర్పంచ్ మిర్యాల వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పాల్వాయి జితేందర్ రెడ్డి,సాగర్ల లింగస్వామి, ఎండి అన్వర్,వల్లంచెట్ల రవి,దుబ్బ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదాం వద్ద ట్రాక్టర్ ఇంజన్ చోరీ.. రైతులో ఆందోళన

నల్గొండ, మే 14:మండల కేంద్రంలోని గోదాం వద్ద ట్రాక్టర్ ఇంజన్ చోరీకి గురైన ఘటన గురువారం కలకలం రేపింది. ఒకవైపు ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం, మరోవైపు ట్రాక్టర్ చోరీతో రైతు ఆందోళన చెందుతున్నాడు.

స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. మునిపెల్లి గ్రామానికి చెందిన నల్ల ప్రభాకర్ రెడ్డి యాజమాన్యంలోని టీఎస్ 18 ఎఫ్ ? 9377 నంబర్ గల ట్రాక్టర్‌లో అదే గ్రామానికి చెందిన అయిండ్ల సక్కరయ్యకు చెందిన మొక్కజొన్న సంచులను గోదాంలో అన్‌లోడ్ చేయడానికి బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో తీసుకెళ్లారు.

గోదాం వద్ద వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో అన్‌లోడ్ చేయడానికి సమయం పట్టే అవకాశం ఉండటంతో ట్రాలీతో సహా ట్రాక్టర్‌ను అక్కడే నిలిపి ఉంచి వెళ్లారు. గురువారం ఉదయం వెళ్లి చూడగా లోడ్‌తో ఉన్న ట్రాలీ మాత్రమే ఉండగా, ఇంజన్‌తో కూడిన ట్రాక్టర్ కనిపించలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# ఏఐ-సామర్థ్యంతో హైపర్-లోకల్ వాతావరణ సూచనలిచ్చే వ్యవస్థలకు 'ఐఎండీ' శ్రీకారం: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మే 14: కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యంతో దేశవ్యాప్తంగా హైపర్-లోకల్, ప్రభావ ఆధారిత వాతావరణ సూచనలిచ్చే అత్యాధునిక వ్యవస్థలకు కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర, (స్వతంత్ర బాధ్యత) ప్రధానమంత్రి కార్యాలయ, సిబ్బంది-ప్రజా సమస్యలు- పింఛన్లు, అణుశక్తి, అంతరిక్ష మంత్రిత్వ శాఖల సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఇవాళ శ్రీకారం చుట్టారు. భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఈ రెండు వ్యవస్థలను రూపొందించింది.

ఈ మేరకు ఐఎండీ రూపొందించిన తొలి ఏఐ ఆధారిత వ్యవస్థ దేశంలోని వివిధ ప్రాంతాలలో రుతుపవన పురోగమనాన్ని అంచనా వేస్తుంది. అలాగే, ఉత్తర ప్రదేశ్ కోసం అధిక ప్రాదేశిక రిజల్యూషన్ వర్షపాత అంచనా వ్యవస్థను మంత్రి ఈ రోజు ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ వ్యవస్థలను 'ఐఎండీ' తోపాటు 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియో రాలజీ-పుణె', 'నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోంకాస్టింగ్' సంయుక్తంగా రూపొందించాయి.

ఈ సందర్భంగా డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ- గడచిన దశాబ్ద కాలంలో భారత వాతావరణ అంచనా సామర్థ్యంలో వినూత్న పరిణామాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. సాంకేతికత, డేటా అనుసంధానం, అధునాతన మోడలింగ్ వంటివి అంచనాల కచ్చితత్వాన్ని, ఐఎండీ సేవలపై ప్రజల విశ్వాసాన్ని గణనీయంగా మెరుగుపరిచాయని తెలిపారు. పరిపాలన, విపత్తు సంసిద్ధత, వ్యవసాయ ప్రణాళికలు సహా దైనందిన ప్రభుత్వ నిర్ణయాల్లో ఐఎండీ నేడొక అవిభాజ్య భాగమైందని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ నేపథ్యంలో ఇవాళ ప్రారంభించిన సరికొత్త వ్యవస్థలు సంప్రదాయ వాతావరణ అంచనాల నుంచి ప్రభావా ధారిత-నిర్ణయ మద్దతు అంచనాల వైపు పెనుమార్పును సూచిస్తున్నాయని మంత్రి చెప్పారు. రైతులు, పాలకులు, విపత్తుల నిర్వాహకులు, పౌరులకు కచ్చితమైన, ప్రాంతీయ నిర్దిష్ట, ఆచరణాత్మక సమాచారాన్ని ఇవి సమకూరుస్తాయని తెలిపారు.

న్యూఢిల్లీలోని భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ప్రాంగణంలోగల మహికా హాల్‌లో ఈ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్, ఐఎండీ వాతావరణ శాస్త్ర డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర, ఐఐటీఎం-పుణె డైరెక్టర్ డాక్టర్ సూర్యచంద్ర రావు, ఐఎండీ, ఐఐటీఎం, 'ఎన్‌సీఎం ఆర్‌డబ్ల్యూ ఎఫ్' సీనియర్ శాస్త్రవేత్తలు, అధికారులు సహా ప్రచురణ-ప్రసార మాధ్యమాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారతదేశ వాతావరణ మౌలిక సదుపాయాలు వేగంగా ఆధునిక రూపు సంతరించుకోవడాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. దాదాపు దశాబ్దం కిందట దేశంలో 16 నుండి 17 డాప్లర్ వాతావరణ రాడార్లు మాత్రమే ఉండేవని ఆయన గుర్తుచేశారు. అయితే, ఇప్పుడు సుమారు 50 రాడార్లు పనిచేస్తుండగా, 'మిషన్ మౌసం' కింద మరో 50 ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నామని తెలిపారు. పరిశీలన నెట్‌వర్కులు, ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థలు, డిజిటల్ కార్యక్రమ వేదికల విస్తరణ ద్వారా దేశవ్యాప్తంగా వాతావరణ అంచనా సామర్థ్యంతోపాటు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు గణనీయంగా మెరుగయ్యాయని ఆయన పేర్కొన్నారు.

ఏఐ ఆధారిత రుతుపవనాల ముందస్తు అంచనా వ్యవస్థ వాటి పురోగమనంపై నాలుగు వారాలు ముందుగా.. ప్రతి బుధవారం సంభావ్య అంచనాలను సమకూరుస్తుందని చెప్పారు. వ్యవసాయ-రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రచార చట్రం ద్వారా 16 రాష్ట్రాల పరిధిలోని 3,000కు పైగా ఉప జిల్లాల రైతులకు చేయూత లక్ష్యంగా ఈ వ్యవస్థను రూపొందించారు. తదనుగుణంగా వ్యవసాయ ప్రణాళిక -సంసిద్ధత దిశగా కార్యాచరణపరంగా ఉపయోగపడే అంచనాల రూపకల్పనలో ఏఐ ఆధారిత నమూనాలు, విస్తృత శ్రేణి అంచనా వ్యవస్థలు, గణాంక పద్ధతులను ఈ వ్యవస్థ ఏకీకృతం చేస్తుందని ఆయన వివరించారు.

ఉత్తర ప్రదేశ్ కోసం ఈ రోజు ప్రారంభించిన రెండో వ్యవస్థ 'హై స్పేషియల్ రిజల్యూషన్ రెయిన్ ఫాల్ ఫోర్‌కాస్ట్' గురించి మంత్రి వివరించారు. ఇది 10 రోజుల ముందుగానే 1 కిలోమీటరు స్పేషియల్ రిజల్యూషన్‌తో వర్షపాత అంచనాల తయారీలో ప్రయోగాత్మక సేవగా రూపొందిందని ఆయన చెప్పారు. అత్యాధునిక ఏఐ ఆధారిత డౌన్‌స్కేలింగ్ పద్ధతులను ఈ వ్యవస్థ వినియోగించుకుంటుందని పేర్కొన్నారు. తదనుగుణంగా స్వయంచలిత వర్ష మానికలు, వాతావరణ స్టేషన్లు, డాప్లర్ వెదర్ రాడార్లు, ఉపగ్రహ ఆధారిత వర్షపాత సమాచార నిధి నుంచి అందే సమాచారాన్ని ఏకీకృతం చేస్తుందని తెలిపారు.

దేశవ్యాప్తంగా వ్యవసాయం, జల వనరులు, పునరుత్పాదక ఇంధనం, పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణ, మౌలిక సదుపాయాల రంగాలకు ఇది ప్రత్యేకంగా ఉపయోగపడుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇకపై విత్తడం, నీటి పారుదల, పంటల రక్షణ, పంట కోతలపై రైతులు ఇకపై ప్రణాళికబద్ధంగా మరింత స్థానిక కచ్చితత్వంతో, సమాచారంతో తగిన నిర్ణయాలు తీసుకోగలరని ఆయన అన్నారు.

తీవ్ర వాతావరణ పరిస్థితులపై అంచనాల కచ్చితత్వం రీత్యా గడచిన దశాబ్దంతో పోలిస్తే ఇటీవలి పదేళ్లలో భారత్ దాదాపు 40 శాతం మెరుగుదల సాధించిందని మంత్రి తెలిపారు. గత ఐదేళ్లలోనే తుఫాను మార్గం, తీవ్రత, తీరాన్ని తాకడంపై 72 గంటల ముందస్తు అంచనాలు దాదాపు 30-35 శాతం మెరుగయ్యాయని ఆయన చెప్పారు. అలాగే, కాలానుగుణ అంచనాలలో పొరపాట్లు గణనీయంగా తగ్గాయన్నారు. మారుతున్న వాతావరణ సరళి, పెరుగుతున్న తీవ్ర వాతావరణ విపత్తుల వల్ల కచ్చితమైన, సకాల అంచనాల అవసరం మునుపెన్నడూ లేనంత ఆవశ్యకమైందన్నారు. ఇటీవలి అస్తవ్యస్త వాతావరణ పరిస్థితులను ప్రస్తావిస్తూ- భారత్‌కు నేడు శాస్త్రీయంగా రూపొందినవే కాకుండా తక్షణ పరిపాలన, ప్రభుత్వ నిర్ణయాలకు మద్దతిచ్చే సామర్థ్యంగల వాతావరణ అంచనా వ్యవస్థలు ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు.

దేశంలో వాతావరణ అంచనాలు, సేవల ఆధునికీకరణ దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను చేపట్టిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ మేరకు "మిషన్ మౌసమ్, రాడార్ నెట్‌వర్క్‌ల విస్తరణ, పరిశీలన వ్యవస్థల బలోపేతం, డేటా కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్" సౌకర్యాల పెంపు వంటివన్నీ మరింత పటిష్ఠ, సాంకేతికాధారిత అంచనా వ్యవస్థ రూపకల్పనలో దోహదం చేస్తున్నాయని ఆయన చెప్పారు.

విస్తృత ప్రచారం, చివరి అంచెదాకా అనుసంధానానికి భరోసాగా వాతావరణ సలహాలు, ముందస్తు హెచ్చరికలను ఇప్పుడు మొబైల్ అప్లికేషన్లు, సంక్షిప్త సందేశాలు, వాట్సాప్, కిసాన్ పోర్టళ్లు, టెలివిజన్, ఇతరత్రా డిజిటల్ వేదికలు సహా బహుళ మాధ్యమాల ద్వారా అందిస్తున్నట్లు ఆయన గుర్తుచేశారు. తీవ్ర వాతావరణ ముప్పుల సమయంలో నష్టాల తగ్గింపు దిశగా స్థానిక సంస్థలతోపాటు భాగస్వామ్య వ్యవస్థలన్నీ వాతావరణ సలహాలను సకాలంలో పాటించడం ఎంతో ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్ మాట్లాడుతూ- నేడు ప్రారంభించిన కొత్త వ్యవస్థలు సంఖ్యాత్మక వాతావరణ అంచనా నమూనాలతోపాటు ఏఐ-డేటా ఆధారిత విధానాల సమ్మేళనంతో రూపొందించిన భాగస్వామ్య ఆధారిత అంచనా వ్యవస్థలని ఆయన వివరించారు. అత్యంత స్థానిక, అధిక రిజల్యూషన్ వాతావరణ సూచనల దిశగా వ్యవసాయం సహా ఇతర రంగాల నుంచి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ వ్యవస్థలను రూపొందించామని ఆయన అన్నారు.

రుతుపవనాల ముందస్తు అంచనా వ్యవస్థ ఇకపై జిల్లా స్థాయి ప్రమాణాలతో రుతుపవనా పురోగమనంపై సూక్ష్మ అంచనాలను అందిస్తుందని డాక్టర్ రవిచంద్రన్ తెలిపారు. ఇక ఉత్తర ప్రదేశ్ ప్రయోగాత్మక ప్రాజెక్టు దట్టమైన పరిశీలన నెట్‌వర్క్‌ల తోపాటు ఏఐ పద్ధతులను అనుసరిస్తుందని చెప్పారు. తద్వారా 1 కిలోమీటరు రిజల్యూషన్‌తో నిర్దిష్ట వర్షపాత అంచనాలను రూపొందించగల సామర్థ్యం దీనికి ఉందన్నారు. వాతావరణ పరిశీలన మౌలిక సదుపాయాలు పెరుగుతున్న కొద్దీ, ఇలాంటి సేవలు క్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకూ అందుతాయని ఆయన తెలిపారు.

చివరగా, డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... ఇవాళ ప్రారంభించిన కొత్త వ్యవస్థలను- దేశం కోసం వాతావరణ మార్పులను తట్టుకోగల, డిజిటల్ సాధికారతగల పౌర కేంద్రక సేవా వ్యవస్థల రూపకల్పనలో కీలక మలుపుగా అభివర్ణించారు. ఈ శాస్త్రవిజ్ఞాన పురోగమనం సామాజిక-ఆర్థిక ప్రయోజనాలకు ప్రత్యక్షంగా దోహదం చేస్తుందని ఆయన ప్రకటించారు.

# సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి..



మంచిర్యాల, మే 14: ప్రభుత్వం పాఠశాలల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. యాదయ్య అన్నారు.మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపు ను ఆయన గురువారం మధ్యాహ్నం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపుల వల్ల విద్యార్థుల్లో స్కిల్ డెవలప్మెంట్ అభివృద్ధి చెందుతుందన్నారు.

మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ ఎఫ్ఆర్సీ ద్వారా ఉత్తమ హాజరు శాతం పొందిన పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళికి ప్రశంసా పత్రం అందజేసి డీఈఓ అభినందించారు.టెన్త్లో ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయకుమార్,ఆ పాఠశాలల హెచ్ఎం గోళ్ల రామన్న,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి, కలమడుగు సర్పంచి బొంతల నాగమణి-మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అల్పాహారం : డీఈవో రాము

జగిత్యాల మే 14: వచ్చే విద్యా సంవత్సరం ( 2026-27 ) నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా అందించనున్నట్లు జిల్లా విద్యాధికారి కె. రాము తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యతో పాటు సమగ్ర అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారని, 3 వేల మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషమని వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 9 వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులకు అందజేయనున్నట్లు చెప్పారు.

జిల్లాలో కొత్తగా 78 ప్రీ-ప్రైమరీ పాఠశాలలు, 3 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని వివరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి ఆర్థిక భారం మోసే బదులు, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రకళ, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు బోయినిపెల్లి ఆనంద్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.తెలంగాణ వార్తలు

# పంట పండిస్తే కొనే దిక్కులేకపాయే : మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



నల్గొండ, మే 14:ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక రైతులు అవేదన చెందుతున్నారని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం డిండి మండలం తవక్లపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేకపాయే అన్నారు. కనీసం సరిపడా గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్థితిలో కూడా ప్రభుత్వం లేదన్నారు. కేసీఆర్ ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదన్నారు. ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 2 కేజీలు, మిల్లర్లు 3 కేజీలు వడ్లు కట్ చేస్తున్నారని, దాన్ని వెంటనే ఆపాలన్నారు. అధికారులు ఏం చేస్తున్నారని, కొనుగోలు కేంద్రాల్లో తిరగాలి అని సూచించారు.

ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని దుయ్యబట్టారు. పాలన చేతకాకుంటే రేవంత్ రెడ్డి దిగిపోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రాజీనేని వెంకటేశ్వర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ మాధవరం శ్రీనివాస్ రావు, సర్పంచ్ మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్ రావు, గొడుగు వెంకటయ్య, గిరమోని శ్రీను, రమావత్ తులసీరామ్, జంగయ్య పాల్గొన్నారు.

# ఎంపీపీ నిధులతో బోర్‌వెల్ ఏర్పాటు

ఖమ్మం, మే 14:చుంచుపల్లి మండల ప్రజా పరిషత్ 2023-2024 సంవత్సరానికి గాను ఎంపీపీ నిధుల ద్వారా పీఎఫ్ఎంఎస్ పద్ధతిలో మంజూరైన బోర్‌వెల్ (మోటార్‌తో సహా) ఎన్ కె నగర్ పంచాయతీ పరిధిలోని చుంచుపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి సౌకర్యం మెరుగుపడేలా బోర్‌వెల్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌కే నగర్ బాదావత్ తండా సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్, ఏఈ వసంత, ఉప సర్పంచ్ లక్ష్మి, సెక్రటరీ ఇందిర, పాలకవర్గ సభ్యులు జాన సుజాత, అరుణ, క్రాంతి, లక్ష్మి పాల్గొన్నారు.

# ముస్సోరీలోని జాతీయ సుపరిపాలన కేంద్రంలో(ఎన్‌సీజీజీ) ప్రారంభమైన సీషెల్స్ సివిల్ సర్వీసెస్ అధికారుల శిక్షణ కార్యక్రమం

న్యూఢిల్లీ, మే 14:ముస్సోరీలోని జాతీయ సుపరిపాలన కేంద్రంలో(ఎన్‌సీజీజీ) సీషెల్స్ దేశ ప్రభుత్వానికి చెందిన సివిల్ సర్వీసెస్ అధికారుల (సివిల్ సర్వెంట్ల) శిక్షణ కార్యక్రమం 2026 మే 11న ప్రారంభమైంది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సహకారంతో ముస్సోరీ, ఢిల్లీలో మే 11 నుంచి మే 22 వరకు ఈ రెండు వారాల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మొదటి బ్యాచ్‌లో రక్షణ, ఐటీ, ఆర్థికం, న్యాయం, విద్య, ప్రజా పాలన, అధ్యక్ష కార్యాలయం వంటి కీలక విభాగాలకు చెందిన డైరెక్టర్ జనరళ్లు, ఉన్నతాధికారులతో సహా మొత్తం 29 మంది పాల్గొంటున్నారు.

2026 ఫిబ్రవరిలో ఎన్‌సీజీజీ, సీషెల్స్ పబ్లిక్ సర్వీస్ బ్యూరో (పీఎన్‌బీ) మధ్య కుదిరిన చారిత్రాత్మక అవగాహన ఒప్పందంలో (ఎంఓయూ) భాగంగా దీనిని నిర్వహిస్తున్నారు. మూడేళ్ల పాటు కొనసాగే ఈ ఒప్పందం ప్రకారం 250 మంది సీషెల్స్ ప్రభుత్వ ఉన్నతాధికారులకు శిక్షణ ఇవ్వటం కోసం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా సంస్థాగత నాయకత్వాన్ని బలోపేతం చేయడం, డిజిటల్ పరివర్తనను వేగవంతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

జాతీయ సుపరిపాలన కేంద్రం (ఎన్‌సీజీజీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ సురేంద్రకుమార్ బాగ్డే అధ్యక్షతన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. 29 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందానికి స్వాగతం పలికిన డాక్టర్ బాగ్డే.. భారత్, సీషెల్స్ దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ చారిత్రాత్మక, సాంస్కృతిక బంధాలను గుర్తు చేశారు. సీషెల్స్ దేశ సుస్థిర అభివృద్ధికి అవసరమైన కీలక రంగాలను దృష్టిలో ఉంచుకొని ఆయా అధికారుల వృత్తిపరమైన నిపుణత కు అనుగుణంగా ఈ శిక్షణను అత్యంత జాగ్రత్తగా రూపొం దించినట్లు ఆయన ప్రధానంగా చెప్పారు. "జాతీయ స్థాయిలో అత్యంత ప్రభావవంతమైన కార్యక్రమాలను రూపొందించటం.. అమలు చేయడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానాన్ని అధికారులకు అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం" అని ఆయన పేర్కొన్నారు. పరస్పర అభ్యాసం, భవిష్యత్తులో అవసరమైన శిక్షణ అంశాలను గుర్తించడానికి వీలుగా సీషెల్స్ అనుభవాలను కూడా తమతో పంచుకోవాల్సిందిగా ఆయన ప్రతినిధులను ఆహ్వానించారు.

అధ్యక్ష కార్యాలయంలోని క్యాబినెట్ కార్యాలయం, విధాన వ్యవహారాల క్యాబినెట్ ఉప కార్యదర్శి, ప్రతినిధి బృంద నాయకుడు అలెక్స్ హెండర్సన్ మాట్లాడుతూ.. ఈ అవకాశం కల్పించినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం కేవలం సామర్థ్య పెంపుదలకు మాత్రమే కాకుండా భారత్, సీషెల్స్ మధ్య ద్వైపాక్షిక చర్చలను ప్రోత్సహించడానికి.. ఇరు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని ఆయన ప్రముఖంగా చెప్పారు.

ఎన్‌సీజీజీతో పాటు గత కొన్నేళ్లుగా ఆ సంస్థ సాధించిన కీలక విజయాల గురించి ఎన్‌సీజీజీ అసోసియేట్ ప్రొఫెసర్, ఈ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ బీ.ఎస్. బిష్త్ వివరించారు. ఈ శిక్షణ ప్రధానంగా సుపరిపాలన సూత్రాలు, విధానాల రూపకల్పన- అమలు, పాలనలో సాంకేతిక ఆవిష్కరణలు వంటి అంశాలపై దృష్టి సారిస్తుందని ఆయన పేర్కొన్నారు. వీటితో పాటు కోర్టు నిర్వహణ- భారత్‌లో న్యాయ సంస్కరణలు, ఈ-కోర్టులు, ప్రభుత్వ కొనుగోళ్లలో పారదర్శకత కోసం జీఈఎం, ఏఐ ఆధారిత సుపరిపాలన, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పీఎం గతిశక్తి, పరిపాలనలో నైతికత- చిత్తశుద్ధి, మౌలిక సదుపాయాలలో పీపీపీ నమూనా, జాతీయ భద్రత, డిజిటల్ చెల్లింపులు వంటి వైవిధ్యమైన అంశాలపై శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. శిక్షణలో భాగంగా రెండో దశలో అధికారులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు పలు ముఖ్యమైన సంస్థలకు క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

ఎన్‌సీజీజీ ఇప్పటి వరకు మడగాస్కర్, మలేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్, కెన్యా, టాంజానియా, ట్యునీషియా, సెషెల్స్, గాంబియా, మాల్దీవులు, ఆఫ్ఘనిస్తాన్, లావోస్, వియత్నాం, నేపాల్, భూటాన్, మయన్మార్, ఇథియోపియా, ఎరిట్రియా, కాంబోడియాతో పాటు ఇతర ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి దాదాపు 52 దేశాలకు చెందిన 5,500 మందికి పైగా ప్రభుత్వ ఉన్నతాధికారులకు శిక్షణ అందించింది.

కోర్సు సమన్వయకర్త డాక్టర్ బీ.ఎస్. బిష్త్, అసోసియేట్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్ శర్మ పర్యవేక్షణలో ఎన్‌సీజీజీ సామర్థ్య పెంపుదల బృంద సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# ప్రధాని శ్రీ మోదీ దార్శనికతతో స్వయం సమృద్ధ విద్యుత్ వాహన వ్యవస్థ వైపు భారత్ అడుగులు: కుమారస్వామి

న్యూఢిల్లీ, మే 14:స్వచ్ఛ ఇంధనంతో రవాణా రంగం మార్పు దిశగా భారత్ ముందడుగు వేసింది. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద దేశ విద్యుత్ వాహన చార్జింగ్ వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి శ్రీ హెచ్.డి. కుమారస్వామి మంగళవారం బెంగళూరులో కీలక ఆమోదాలు, విధానపరమైన నిర్ణయాలను ప్రకటించారు.

కర్ణాటకకు సంబంధించి, రాష్ట్రంలో 123.26 కోట్ల రూపాయల వ్యయంతో 1,243 విద్యుత్ వాహన చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనల ఆమోదాన్ని కేంద్ర మంత్రి ప్రకటించారు. ఈ ప్రకటన భారత విద్యుత్ వాహన రంగం మార్పులో కర్ణాటకను అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా నిలబెట్టింది.

పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద దేశవ్యాప్త విద్యుత్ వాహన చార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనపై బెంగళూరులో జరిగిన జాతీయ సదస్సులో కుమారస్వామి మాట్లాడారు. భారత ప్రముఖ విద్యుత్ వాహన చార్జింగ్ కేంద్రాలలో ఒకటిగా బెంగళూరు అవతరించిందని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛ ఇంధన వాహన రంగం వైపు దేశవ్యాప్త మార్పును వేగవంతం చేయడంలో ఇతర రాష్ట్రాలు కూడా చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు.

వివిధ రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 4,874 విద్యుత్ వాహన చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ఇప్పటివరకు 503.86 కోట్ల రూపాయల విలువైన ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు మంత్రి తెలిపారు. ఈ ఆమోదిత ప్రతిపాదనల్లో హెచ్పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ వంటి ప్రధాన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కేరళ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందినవి ఉన్నాయి.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కొనియాడుతూ, 2070 నాటికి కర్బన ఉద్గారాల రహిత లక్ష్యాన్ని చేరుకోవడానికి కట్టుబడి ఉంటూనే, వికసిత భారత్ 2047 దార్శనికత వైపు భారత్ స్థిరంగా అడుగులు వేస్తోందని కేంద్ర మంత్రి శ్రీ కుమారస్వామి తెలిపారు. సుస్థిరత, ఆవిష్కరణలు, విస్తృతికి ప్రధానమంత్రి ఇస్తున్న ప్రాధాన్యత రవాణా, ఇంధన రంగాల పట్ల భారత్ దృక్పథాన్ని పూర్తిగా మార్చివేసిందని ఆయన పేర్కొన్నారు.

భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో వాహన రంగం వాటా 7 శాతానికి పైగా ఉందని, తయారీ రంగ స్థూల దేశీయోత్పత్తిలో ఇది దాదాపు సగం అని మంత్రి చెప్పారు. సుమారు 3 కోట్ల మంది జీవనోపాధికి ఈ రంగం అండగా నిలుస్తూ, దేశ స్వచ్ఛ ఇంధన రవాణా మార్పులో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.

భవిష్యత్ రవాణా సాంకేతికతలకు అంతర్జాతీయ కేంద్రంగా భారత్ స్థానాన్ని బలోపేతం చేయడానికి భారీ పరిశ్రమల శాఖ ప్రారంభించిన పలు ప్రధాన కార్యక్రమాలను కూడా ఆయన ప్రస్తావించారు. వీటిలో బ్యాటరీ సెల్ తయారీ కోసం 18,100 కోట్ల రూపాయల పీఎల్ఐ ఏసీసీ పథకం, విద్యుత్ వాహనాలు, హైడ్రోజన్ వాహనాలతో సహా స్వచ్ఛమైన వాహనాలను ప్రోత్సహించే 25,938 కోట్ల రూపాయల పీఎల్ఐ ఆటో పథకం, అరుదైన భూ అయస్కాంతాల తయారీలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో ఇటీవల ప్రారంభించిన 7,280 కోట్ల రూపాయల ఆర్ఈపీఎం పథకం ఉన్నాయి.

పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని భారత్ విద్యుత్ వాహన మార్పునకు మూలస్తంభంగా అభివర్ణిస్తూ, ఈ 10,900 కోట్ల రూపాయల కార్యక్రమం విద్యుత్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, బస్సులు, ట్రక్కుల వినియోగాన్ని వేగవంతం చేస్తోందని శ్రీ కుమారస్వామి తెలిపారు. దేశవ్యాప్తంగా పటిష్టమైన విద్యుత్ వాహన చార్జింగ్ మౌలిక సదుపాయాలను ఇది కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ వాహన బహిరంగ చార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేకంగా 2,000 కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు.

దేశవ్యాప్తంగా చార్జింగ్ మౌలిక సదుపాయాల విస్తరణలో బీపీసీఎల్, ఐఓసీఎల్, హెచ్పీసీఎల్ వంటి చమురు మార్కెటింగ్ సంస్థల కృషిని కూడా మంత్రి ప్రస్తావించారు. ఫేమ్-2 పథకం కింద, భారీ పరిశ్రమల శాఖ నుంచి లభించిన 873.5 కోట్ల రూపాయల రాయితీ సహాయంతో ఈ సంస్థలు దేశవ్యాప్తంగా 8,932 విద్యుత్ వాహన చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. వీటిలో 721 కేంద్రాలు ఒక్క కర్ణాటకలోనే ఏర్పాటయ్యాయి.

ఆవిష్కరణలు, అమలు సామర్థ్యాల ద్వారా భారత విద్యుత్ వాహన వ్యవస్థను బలోపేతం చేయడంలో చార్జ్ పాయింట్ ఆపరేటర్లు, టాటా పవర్, చార్జ్ జోన్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి పారిశ్రామిక సంస్థల పాత్రను కూడా శ్రీ కుమారస్వామి ప్రశంసించారు.

మంత్రిత్వ శాఖ తదుపరి ప్రధాన కార్యక్రమాన్ని వివరిస్తూ, జాతీయ ఏకీకృత విద్యుత్ వాహన చార్జింగ్ యాప్ - యూనిఫైడ్ భారత్ ఇ-చార్జ్ (యూబీసీ) ని రూపొందిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. వివిధ సంస్థల చార్జింగ్ కేంద్రాలను నమ్మకమైన ఒకే వేదిక ద్వారా గుర్తించడానికి, వినియోగించుకోవడానికి, రుసుము చెల్లించడానికి ఈ వ్యవస్థ వీలు కల్పిస్తుంది. డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ తీసుకొచ్చిన మార్పుతో దీనిని పోలుస్తూ, ఈ ప్రయత్నం భారత విద్యుత్ వాహన చార్జింగ్ వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

దేశంలో విద్యుత్ వాహన రంగ వేగవంతమైన వృద్ధికి తోడ్పడేలా గ్రిడ్ సంసిద్ధత, ప్రామాణీకరణ, డిజిటల్ అనుసంధానంపై విద్యుత్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల భాగస్వాములను సమన్వయం చేసుకుంటూ భారీ పరిశ్రమల శాఖ పని చేస్తోందని కుమారస్వామి తెలిపారు.

భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వివరిస్తూ, భారత విద్యుత్ వాహన చార్జింగ్ మౌలిక సదుపాయాల వ్యూహం మూడు ప్రధాన సూత్రాలు - అందరికీ అందుబాటు, తక్కువ ధర, విశ్వసనీయత - ఆధారంగా ఉంటుందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో చార్జింగ్ సదుపాయాలు సులభంగా దొరికేలా, సామాన్యుడికి అందుబాటులో ఉండేలా, నమ్మదగ్గవిగా ఉండేలా చూడటమే ఈ సూత్రాల లక్ష్యమని ఆయన వివరించారు.

"మనం కేవలం చార్జింగ్ స్టేషన్లను మాత్రమే ఏర్పాటు చేయడం లేదు. భారత భవిష్యత్తుకు శక్తిని అందిస్తున్నాం" అని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, ప్రపంచ స్వచ్ఛ ఇంధన రవాణా మార్పును ముందుండి నడిపించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



మహబూబ్‌నగర్, మే 14:ధాన్యం కొనుగోళ్లలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ రైతులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు.

గత పదేళ్ల నుంచి వడ్ల కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరుగగా కాంగ్రెస్ హయాంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తాలు లేకుండా శుభ్రంగా ధాన్యం తూర్పు పట్టినా తరుగు పేరుతో మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

ధాన్యం అసలు ప్రభుత్వం కొంటుందా.. మిల్లర్లు ధాన్యం కొంటున్నారా గందరగోళ పరిస్థితులున్నాయని పేర్కొన్నారు.

అధికారులు రాగానే వారి వెంట పోలీసులను తీసుకువస్తారని తమ సమస్య చెప్పాలన్నా కూడా ఇబ్బందులు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన ప్రభుత్వం, అధికారులు నిలబడటం లేదని వాపోయారు. ఏ ఒక్క మిల్లు యజమాని కూడా అధికారుల మాటను ఖాతరు చేయడం లేదని వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నల్గొండ, మే 14:నల్లగొండ పట్టణంలోని వెల్కమ్ నల్లగొండ బోర్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్ఐ డి.సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం రాజన్నగూడెంకు చెందిన బొల్లం లింగయ్య (40) కూలీ పనుల్లో భాగంగా గుగ్గిన పల్లి హనుమంతరెడ్డితో కలిసి ద్విచక్రవాహనంపై మిర్యాలగూడ వైపు వస్తుండగా ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌కు వెళ్లే మార్గంలో వెనుక నుండి అతివేగంగా అజాగ్రత్తగా వచ్చిన కంటేనర్ ఢీకొట్టినట్లు తెలిపారు. ద్విచక్రవాహనం నడుపుతున్న హనుమంతరెడ్డి ఎగిరి ఎడుమవైపు పడగా లింగయ్య కుడివైపు పడి కంటేనర్ వెనుక టైర్ కింద పడి నడుము పై నుండి వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జుఅయి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. హనుమంతరెడ్డికి మాత్రం గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించిన చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. లింగయ్య భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

నల్గొండ, మే 14:కోదాడ మున్సిపాలిటీ పరిధిలో 26వ వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆ వార్డు కౌన్సిలర్ నేహా నాజ్ బషీర్ అన్నారు. గురువారం వార్డులో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు సొంత ఖర్చులతో వాటర్ ట్యాంకర్ ను ఏర్పాటు చేసి మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ వైస్ చైర్మన్ జబ్బార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్ లతో కలిసి ప్రారంభించారు. వార్డు ప్రజలకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. వార్డులో ప్రతి ఇంటికి ఉచితంగా మంచి నీరు సరఫరా చేస్తామన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ వైస్ చైర్మన్ జబ్బార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్ లు మాట్లాడుతూ.. కౌన్సిలర్ నేహా నాజ్ వార్డు ప్రజల కోసం సొంత ఖర్చులతో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వార్డు అభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎం కాజా, ఫ్రూట్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబా, చాంద్ పాషా, ముస్తఫా, గన్నేమియా, ముక్తి హతహర్, శ్రీరంగం ప్రమీల, కాసర్ల రాజు, మైనార్టీ నాయకులు బాగ్దాద్, భాయిజాన్, ఫోర, నసీర్, టిల్లు, నిస్సార్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# కేటీఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ బృందం భేటీ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో భారత్‌లోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ , కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ భేటీ అయ్యారు. నందినగర్‌లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు , వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిని వివరించారు.

తెలంగాణ ,ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఇరువురు ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ , ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు కొనసాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆయన అన్నారు.

# క్రమం తప్పకుండా పొదుపు అప్పులు చెల్లించాలి : ఏపీఎం వినోద్ క్రాంతి

ఖమ్మం, మే 14: గ్రామీణ మహిళల పేదరిక నిర్మూలనే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ క్రమం తప్పకుండా పొదుపు సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను గ్రూప్ సభ్యులు సకాలంలో క్రమం తప్పకుండా చెల్లించాలని కరకగూడెం మండలం ఏపీఎం వినోద్ క్రాంతి సూచించారు. గత రెండు రోజులుగా మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో 27 గ్రామ సమాఖ్య సంఘాలతో నిర్వహిస్తున్న శిక్షాణా ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. క్రమం తప్పకుండా గ్రామాల్లోని సంఘాలు సమావేశాలు నిర్వహించుకుంటూ పొదుపులు, అప్పులు సకాలంలో చెల్లించాలన్నారు. మహిళ సంఘాలు సామాజిక కార్యక్రమా ల్లో చురుగ్గా పాల్గొని నిర్వహణ కార్యక్రమం చేపట్టాలన్నారు. తద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం పలు అంశాలపై జెండర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ స్టేట్ రిసోర్స్ పర్సన్లు జ్యోతి, దీవెన, సీసీలు విజయలక్ష్మి, సత్యనారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, సిబ్బంది పీత్రీ పాల్గొన్నారు.

# నల్లగొండ పట్టణంలో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ఆకస్మిక తనిఖీలు



నల్గొండ, మే 14: హోటల్లు, బేకరీలలో, నాణ్యత ప్రమాణాలతో పాటు పరిశుభ్రత పాటించకుండా ఆహారాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివశంకర్ రెడ్డి సూచించారు. గురువారం ఆయన నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్, రామగిరి, హైదరాబాద్ రోడ్, ఎన్‌జీ కళాశాల పరిసర ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఆకస్మికంగా తనిఖీ చేసి అనంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. డ్రైవ్‌లో భాగంగా వీధి వ్యాపారులు, టీ దుకాణాలు, ఫుడ్ కోర్టులు, బేకరీలు, హోటళ్లు తదితర ఆహార వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. వంట నూనెలను టీపీసీ మీటర్‌తో పరీక్షించడంతో పాటు టీ పొడి, పాలు, మిరప పొడి, పసుపు నమూనాలను ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్‌లో పరీక్షించారు. తాగునీటి నమూనాలను కూడా పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాల్లో పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని వ్యాపారులకు సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ చేతులను తరచుగా శుభ్రం చేసుకోవడం, గ్లౌజులు, హెడ్ క్యాప్స్ వినియోగించడం, పరిశుభ్రమైన దుస్తులు ధరించడం, ఆహార పదార్థాలను మూతపెట్టి ఉంచడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వీధి వ్యాపారులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన, సురక్షితమైన ఆహార పదార్థాలను మాత్రమే ప్రజలకు అందించాలని అధికారులు కోరారు. వాడిన వంట నూనెలను పూర్తిగా తొలగించి కొత్త నూనెలను వినియోగించాలని సూచించారు. నూనెలను పరిమితికి మించి వేడి చేయరాదని, టీపీసీ శాతం 25 శాతానికి మించకూడదని తెలి పారు. అలాగే వాడిన వంట నూనెలను ఇతరులకు విక్రయించకుండా, ఎఫ్ఎస్ఎస్ఏఐ రూకో పథకం కింద నమోదు చేసుకున్న అగ్రిగేటర్లకే విక్రయించాలని సూచించారు. ఈ విధంగా విక్రయిస్తే వాడిన నూనెలకు నగదు చెల్లించి సేకరిస్తారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సురక్షిత ఆహార విక్రయాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది వెంకటపతి వంశీ పాల్గొన్నారు.

# టీటీడీకి రిలయన్స్ ఈడీ రూ.1.51 కోట్లు విరాళం

తిరుపతి, మే 14:వేంకటేశ్వర స్వామి కొలువుదీరిన తిరుమల లో భక్తుల దర్శనం కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోగా అతిథి గెస్ట్‌హౌజ్ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 15 గంటల్లో సర్వదర్శనం అవుతుందని సంబంధిత అధికారులు వివరించారు.

నిన్న స్వామివారిని 78,024 మంది భక్తులు దర్శించుకోగా 36,826 మంది తల నీలాలు సమర్పించుకున్నారు.

భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.85 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

కాగా గురువారం రిలయన్స్ సంస్థ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ పి.ఎం.ఎస్ ప్రసాద్ టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.1.51 కోట్లు విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ పేష్కార్ రామకృష్ణకు విరాళం డీడీని అందజేశారు.

# అపర భగీరథుడు ఆర్థర్ కాటన్

''నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహమతిః, స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం"

ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరుథుడైన ఆంగ్లేయ ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం.

కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళ్లు చాలామంది కనిపిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతిలో అనేక అంశాలలో గోదావరి, కృష్ణా తీరం ముందు ఉండడంలో కాటన్ శ్రమ ఉందని భావించక తప్పదు.

కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 – జూలై 24, 1899) బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ తన జీవితాన్ని బ్రిటిషు భారత సామ్రాజ్యములో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి జీవితాన్ని ఫణంగా పెట్టిన మేధావి, కార్యశీలి. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు.

అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుపున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 1828–29 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు.

కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. ఆర్థర్ కాటన్ అనే ఇంజనీరుకు సదరు ప్రతిపాదన అప్పగించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని బ్రిటీష్ ప్రభుత్వం అప్పగించడంతో ఆయన అందుకు అనువైన ప్రాంతం



మే 15... సర్ ఆర్థర్ కాటన్ జయంతి

కోసం సుదీర్ఘ అన్వేషణ చేశారు.

అలా 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. లండన్‌లోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదానికి పంపించారు. ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించిన తర్వాత, 1846 ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది.

1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆనకట్ట నిర్మాణంలో పది వేలమంది కూలీలతో పాటుగా ఐదు వందల మంది వడ్రంగులు, ఐదు వందల మంది కమ్మరులను వినియో గించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 అగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో యంత్ర సామాగ్రితో నిర్మాణపు పనులు ముమ్మరమయ్యాయి. నది ఒడ్డుకు చేర్చిన రాళ్లు, ఇతర సామగ్రిని పడవల ద్వారా నదిలోని నిర్మాణ ప్రాంతానికి రవాణా చేసేవారు. ఇందుకు 25 టన్నుల భారం మోయుగల 18 నావలను వినియోగించారు. కాటన్ కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహుదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు. తర్వాత 1852 గన్నవరం అక్విడక్టు పనులు కూడా కాటన్ ప్రారంభించారు. ఐదేళ్ల లోనే నిర్మాణం జరగడంతో 1852 నాటికి అందుబాటులోకి వచ్చింది.

ధవళేశ్వరం వద్ద ప్రస్తుతమున్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కి పూర్వ రూపంగా ఆనకట్ట ఉండేది. అనేక వరదల తాకిడికి ఆనకట్ట దెబ్బ తినడంతో చివరకు 1970వ దశకంలో కొత్తగా బ్యారేజ్ నిర్మాణం చేశారు.

20వ శతాబ్దం తొలినాళ్లలోనే ఆయా ప్రాంతాల్లో వెనువెంటనే ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి రావడం తో పాటు, పారిశ్రామి కాభివృద్ధి, విస్తారంగా పంటలు, రవాణా సదుపాయాలు ధవళేశ్వరం ఆనకట్ట ద్వారా గోదావరి జల ప్రవాహం ద్వారా లభించాయి.

కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్టకు ప్రోద్బలం కూడా కాటన్ దే. ఆయన బెంగాల్, ఒడిసా, బీహారు, మొదలైన ప్రాంతాల నదులను మానవ ఉపయోగం చేయడానికి ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేశాడు. తెలుగు వారే కాదు తమిళులు, ఒరియాలు, బెంగాలీలు, ఒరియాలు, బీహారీలు మొత్తం భారతీయులే ఆయనకు ఎంతో రుణ పడి ఉంటారు. తమపాలిట దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణదాతగా మార్చిన ఆర్థర్ కాటన్... అపర భగీరథునికి, ప్రాతః స్మర స్మరణ చేయడం తప్ప ఏమిచ్చుకోగలరు.



–రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

## విద్యాప్రమాణాలు పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం లక్ష్యం : కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్, మే 14:ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచి బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వ సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది పదవ తరగతి ఫలితాల్లో ఇంద్రవెల్లి పాఠశాల విద్యార్థులు చూపిన ప్రతిభపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 271 మంది విద్యార్థులకు గాను 270 మంది ఉత్తీర్ణత సాధించడం గొప్ప విషయమన్నారు.

ఈ ఘనత సాధించిన ఉపాధ్యాయ బృం దాన్ని, విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రస్తుతం ఉన్న 64 శాతం హాజరును ఈ విద్యా సంవత్సరం మొదటి వారం నుంచే కనీసం 75 శాతానికి పెంచాలని ఉపాధ్యాయులను, స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు.

ఎండలు, వర్షాలు వంటి కారణాలతో విద్యార్థులు బడికి దూరం కాకూడదని, ప్రతి రోజూ విద్యార్థులు బడికి వచ్చేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో జీవన్ రెడ్డి, సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ కేసు.. ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి: సీఎం ఆదేశం

అమరావతి, మే 14: అగ్రిగోల్డ్ బాధితులకు ఆరునెలల్లో న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సీఎం అధ్యక్షతన ఈరోజు (గురువారం) సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడానికి సంబంధించి ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. ఎనిమిది రాష్ట్రాల్లో 19 లక్షల మంది బాధితులు ఉన్నారని తెలిపారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 11 లక్షల మంది బాధితులు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో బాధితుల సొమ్ము తిన్న వారిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని కొంతమంది కీలక అధికారులు ఉన్నారని వెల్లడించారు. అందువల్లే ఈ కేసుపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని ఆదేశించారు. అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారందరికీ తప్పనిసరిగా న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## బక్రీద్ సందర్భంగా శాంతిభద్రతలకు సహకరించాలి – జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల, మే 14: (నేటినిజం ప్రతినిధి): రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు, సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హిందూ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో 24 గంటల పాటు వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణాపై 1977 గోవధ నిరోధక చట్టం, 1978 ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ యానిమల్స్ రూల్స్, 1960 ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ చట్టాలను కచ్చితంగా అమలు చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని, పశువుల రవాణాపై అనుమానాల పేరుతో రోడ్ల దిగ్బంధనలు, ఘర్షణాత్మక పరిస్థితులు సృష్టించవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే రౌడీ, సస్పెక్ట్ షీట్లు కూడా తెరవబడతాయని స్పష్టం చేశారు. గత ఏడాది ఇటువంటి రెండు కేసులు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం జిల్లా పోలీస్ హెల్ప్‌లైన్ 8712537 826, నోడల్ అధికారి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ 8712656410 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు అందించాలని సూచించారు. అక్రమ రవాణాదారు లపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. సీజ్ చేసిన పశువుల సంరక్షణ కోసం జిల్లాలో 9 ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి, అక్కడ వెటర్నరీ వైద్యులతో పాటు మేత, నీటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐ రవి, ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ. 37,500 కోట్ల ఆర్థిక వ్యయంతో ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకానికి కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, మే 14:ఉపరితల బొగ్గు/ లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహం కోసం రూ. 37,500 కోట్ల వ్యయంతో కూడిన పథకానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

దేశ బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయడంలో ఈ పథకం ఒక కీలక ముందడుగు. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును సంశ్లేషిత వాయువుగా మార్చాలన్న (గ్యాసిఫై) జాతీయ లక్ష్యాన్ని చేరుకోవడానికి, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి ఇది తోడ్పడుతుంది. అలాగే ఎల్ఎన్‌జీ (50 శాతానికి పైగా దిగుమతి), యూరియా (20 శాతం వరకు దిగుమతి), అమోనియా (దాదాపు 100 శాతం), మిథనాల్ (దాదాపు 80-90 శాతం) వంటి కీలక ఉత్పత్తుల కోసం మన దేశం దిగుమతులపై ఆధారపడడాన్ని ఇది తగ్గిస్తుంది.

అలాగే అనియంత్రిత రంగ లింకేజీ వేలం విధానంలో.. 'బొగ్గు వాయువుగా మార్చే సంశ్లేషిత వాయు ఉత్పత్తి' అనే ఉప విభాగం కింద బొగ్గు సరఫరా ఒప్పందాల కాలపరిమితిని ప్రభుత్వం 30 ఏళ్ల వరకు పొడిగించింది. బొగ్గును సంశ్లేషిత వాయువుగా మార్చే ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు దీర్ఘకాలిక విధాన స్థిరత్వాన్ని అందించడం కోసం ఈ చర్యను చేపట్టింది.

శీ కొత్తగా చేపట్టే ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం రూ. 37,500 కోట్లను కేటాయించింది. దీని ద్వారా సంశ్లేషిత వాయువు, అనుబంధ ఉత్పత్తులను పెంచడమే కాకుండా, దాదాపు 75 మిలియన్ టన్నుల బొగ్గు/లిగ్నైట్‌ను గ్యాసిఫికేషన్‌ను లక్ష్యంగా పెట్టుకుంది.

శీ పారదర్శకమైన, పోటీతత్వంతో కూడిన బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఈ ప్రాజెక్టుల ఎంపిక జరుగుతుంది.

ప్రాజెక్టు అంచనా వ్యయం, అవసరమయ్యే బొగ్గు పరిమాణం, దాని ద్వారా వచ్చే సంశ్లేషిత వాయు ఉత్పత్తి సామర్థ్యం వంటి ప్రామాణిక అంశాల ఆధారంగా ఈ ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

శీ ఏదైనా ఒకే ప్రాజెక్టుకు ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకానికి గరిష్ట పరిమితి రూ.5,000 కోట్లు. సంశ్లేషిత సహజవాయువు, యూరియా మినహా ఏదైనా ఒక ఉత్పత్తికి సంబంధించి ప్రోత్సాహకంపై గరిష్ట పరిమితి రూ. 9,000 కోట్లు. అన్ని ప్రాజెక్టులు కలిపి ఏదైనా ఒక సంస్థకు ప్రోత్సాహకానికి గరిష్ట పరిమితి రూ. 12,000 కోట్లు.

శీ ఈ పథకం కింద లభించే ఆర్థిక ప్రోత్సాహకాలు.. వాణిజ్య పరమైన బొగ్గు మైనింగ్ విధానం లేదా ఇతర కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల పథకాల ద్వారా లభించే రాయితీలకు అదనం. వాటిని పొందకుండా ఎటువంటి పరిమితులను ఇవి విధించవు.

శీ ఈ పథకం సాంకేతికతతో సంబంధం లేకుండా అందరికీ వర్తిస్తుంది. అయితే దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడాన్ని ప్రోత్సహిస్తుంది.

శీ ఇంధన భద్రత, దిగుమతి ప్రత్యామ్నాయం: బొగ్గు వనరులను వివిధ రకాలుగా వినియోగించుకుంటూ ఎల్ఎన్‌జీ, యూరియా, అమోనియా, అమోనియం నైట్రేట్, మిథనాల్, కోకింగ్ బొగ్గు దిగుమతులకు ప్రత్యామ్నాయంగా నిలవడం ద్వారా.. ప్రపంచ ధరల అస్థిరత, భౌగోళిక రాజకీయ సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల నుంచి దేశాన్ని కాపాడుతూ ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా లక్ష్యాలను ఈ పథకం ముందుకు తీసుకెళ్తుంది.

శీ ఉపాధి కల్పన: ఈ పథకం ద్వారా బొగ్గు నిక్షేపాలున్న ప్రాంతాల్లోని 25 ప్రాజెక్టుల్లో దాదాపు 50,000 (ప్రత్యక్ష, పరోక్ష) ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.

శీ ప్రభుత్వాలకు ఆదాయం: ఈ పథకం కింద నిర్దేశించిన 75 మిలియన్ టన్నుల గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు/లిగ్నైట్ వినియోగం వల్ల ఏటా రూ. 6,300 కోట్ల ఆదాయంతోపాటు.. జీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో అనుబంధ ఆదాయం కూడా సమకూరుతుందని అంచనా.

శీ సాంకేతిక వ్యవస్థ: దేశీయ సాంకేతికతలను అభివృద్ధి చేయడం, విదేశీ ఈపీసీ కాంట్రాక్టర్లపై ఆధారపడడాన్ని తగ్గించడం ద్వారా.. దేశీయ ఉపరితల బొగ్గు గ్యాసిఫికేషన్ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుంది.

ప్రపంచంలో అత్యంత విస్తృతంగా బొగ్గు (దాదాపు 401 బిలియన్ టన్నులు), లిగ్నైట్ (దాదాపు 47 బిలియన్ టన్నులు) నిల్వలున్న దేశాల్లో భారత్ ఒకటి. దేశ ఇంధన వినియోగంలో బొగ్గు వాటా 55 శాతానికి పైగా ఉంది. గ్యాసిఫికేషన్ ప్రక్రియ ద్వారా బొగ్గు/లిగ్నైట్‌ను 'సంశ్లేషిత వాయువు'గా మారుస్తారు. ఇది దేశీయంగా ఇంధనాలు, రసాయనాల తయారీకి బహుముఖ ముడి పదార్థంగా ఉపయోగపడుతుంది. దీనివల్ల భారత్ విలువైన దిగుమతులకు ప్రత్యామ్నాయాన్ని పొందడమే కాకుండా, అంతర్జాతీయ సరఫరా విఘాతాలు, ధరల అస్థిరత నుంచి తనను తాను కాపాడుకునేందుకు వీలవుతుంది.

ఎల్ఎన్‌జీ, యూరియా, అమ్మోనియం నైట్రేట్, అమ్మోనియా, కోకింగ్ బొగ్గు, మిథనాల్, డీఎంఈ, ఇతర ప్రత్యామ్నాయ ఉత్పత్తుల కోసం భారత్ దిగుమతుల వ్యయం 2025 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 2.77 లక్షల కోట్లుగా ఉంది. అయితే పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా ఈ దిగుమతులపై ఆధారపడడంలోని ప్రమాదం మరింత స్పష్టమైంది.

జాతీయ బొగ్గు గ్యాసిఫికేషన్ మిషన్ (2021), 2024 జనవరిలో ఆమోదించిన రూ. 8,500 కోట్ల పథకం (దీని కింద రూ. 6,233 కోట్ల విలువైన 8 ప్రాజెక్టులు ప్రస్తుతం అమలులో ఉన్నాయి) అందించిన ప్రోత్సాహంతో.. గణనీయమైన తోడ్పాటును ఈ కొత్త పథకం అందిస్తూ, ఆ వేగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లనుంది.

## ఈ ఏటీఎం ఎనీటైం బంద్.. ఇబ్బందుల్లో ఖాతాదారులు

కుభీర్ మే 14:: నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లో ఏటీఎం పాస్ బుక్ ప్రింటర్ కొంత కాలంగా పనిచేయకపోవడంతో ఖాతాదారులకు తిప్పలు తప్పడం లేదు. ఏటీఎం రూంలోనే బ్యాంకు పాస్ పుస్తకాల ప్రింటర్ యంత్రాన్ని ఏర్పాటు చేయడంతో ఖాతాదారులు డబ్బులు తీసుకోవడంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ. వెయ్యి కి 10 కమిషన్ ఇచ్చి నష్టపోతున్నారు.

దీంతోపాటు ఖాతాదారులు తమ ఖాతాల్లో జమ చేసిన డబ్బుల వివరాలను ప్రింట్ చేయించుకుందామంటే ఏటీఎం గదికి తాళం వేసి ఉంటుందని వాపోయారు.

మహిళా సంఘాల సభ్యులు డబ్బులు జమ చేసిన అనంతరం ప్రింట్ తీసి ఇవ్వమని సిబ్బందిని కోరుతున్నా పాస్ బుక్ ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించాలన్న తపన ఏ ఒక్క సిబ్బందిలో కనిపించక పోవడం విడ్డూరంగా ఉందని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ రాహుల్‌ను వివరణ కోరగా ఇంత చిన్న విషయానికి తన వద్దకు రావడం అనవసరం. సిబ్బందికి చెప్పండి అని సమాధానం దాటవేశారు.

## నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలి – కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, మే 14:జిల్లాలో నూతన గోడౌన్ల నిర్మాణానికి సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు




కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్‌డబ్ల్యూసీ), నాబార్డ్, పరిశ్రమల శాఖ, ఎల్‌డీఎం, తహసీల్దార్లు, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ, మార్క్‌ఫెడ్ తదితర శాఖల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం కొత్త గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇందుకు అనువైన స్థలాలను గుర్తించి, నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పనులను త్వరితగతిన ప్రారంభించి గోడౌన్లను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, నాబార్డ్ డీడీఎం దిలీప్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు, ఎస్‌డబ్ల్యూసీ, ఎఫ్‌సీఐ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు కార్యక్రమంలో అఖిలపక్షాలు భాగస్వాములు కావాలి – ఆర్డీఓ కేఎస్ బి కుమారి

రాజన్న సిరిసిల్ల, మే 14: (నేటినిజం ప్రతినిధి): ఓటర్ల నమోదు కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల శ్రేణులు చురుకుగా భాగస్వాములు కావాలని వేములవాడ నూతన ఆర్డీఓ కే.ఎస్.బి. కుమారి సూచించారు. వేములవాడ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను అఖిలపక్ష నేతలు సన్మానించారు. ఈ సందర్భంగా వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి బూత్‌కు అన్ని రాజకీయ పార్టీలు ఒక్కో బూత్ లెవల్ ఏజెంట్ (బీ ఎల్ ఏ)ను నియమించుకోవాలని కోరారు. ప్రభుత్వ పరంగా ఇప్పటికే ప్రతి బూత్‌కు ఒక్కో బూత్ లెవల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. బీ ఎల్ వో, రాజకీయ పార్టీల తరపున నియమితులయ్యే బీ ఎల్ ఏ సమన్వయంతో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అలాగే బోగస్ ఓటర్ల నమోదు జరగకుండా, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, డబుల్ ఓటర్లు లేకుండా చూడటం, ఓటర్ల పేర్లు, చిరునామాల్లో పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కాంగ్రెస్ నేత ఏ. నిత్యానందరావు, బీఆర్ఎస్ నేత పొలాస నరేందర్, బీజేపీ నేత పిన్నింటి హన్మాండ్లు, టీడీపీ నేత చింతలకోటి రామస్వామి గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, డీఏఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,
Hyderabad-500020.
Telangana.'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com